శుక్రవారం
05-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 45
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గోరంట్ల మాధవ్‌పై సస్పెన్షన్ వేటు ?

సోషల్ మీడియాలో ఆయన నగ్న వీడియో వైరల్

- దిల్లీ నుంచి గల్లీ వరకు కలకలం రేపిన ఘటన
- సీఎం జగన్ సీరియస్
- మార్ఫింగ్ చేశారంటున్న ఎంపీ
- కాదని తేలితే చర్యలు తప్పవని సజ్జల స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌పై సస్పెన్షన్ వేటు పడే అవకాశం కనపడుతోంది. మాధవ్‌కు సంబంధించిన నగ్న వీడియో కాల్ సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. పార్లమెంటు సమావేశాలు జరుగుతుండడంతో ఈ వ్యవహారం దిల్లీ నుంచి గల్లీ వరకు, ముఖ్యంగా రాజకీయవర్గాల్లో పెనుదుమారం రేపింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. విషయం ఆయన దృష్టికి రాగానే అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. పార్టీ నేతల ద్వారా కూడా వాస్తవ సమాచారంపై సీఎం ఆరా తీశారు. దీనిపై సీఎం ఆగ్రహంతో ఉన్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఆయనపై సస్పెన్షన్ వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వైసీపీ నేతలు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి భావనకు అనుగుణంగానే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా దీనిపై తీవ్రంగా స్పందించారు. ఆ వీడియోపై విచారణకు ఆదేశించామని, ఎంపీ చెపుతున్నట్లు మార్ఫింగ్ కాని పక్షంలో చర్యలు తప్పవని సజ్జల మీడియాకు చెప్పారు. సజ్జల స్పందనను బట్టి కూడా గోరంట్లపై చర్యలు తప్పవంటున్నారు. అయితే ఎంపీ

- మిగతా 2 లో

హైకోర్టు మార్పు ప్రతిపాదన లేదు

రాజ్యసభలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర హైకోర్టు తరలింపు వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. అమరావతి రాజధాని విషయంలో హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన తీర్పుతో మూడు రాజధానుల విషయంలో వైసీపీ సర్కార్ ముందుకెళ్లలేని పరిస్థితి నెలకొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా గతంలో కేంద్రానికి హైకోర్టు తరలింపుపై ఇచ్చిన ప్రతిపాదనపై ఇటీవల సీఎం జగన్ దిల్లీ పెద్దల వద్ద నోరుమెదపడం లేదు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇంకా నాన్చుడు ధోరణినే అవలంబిస్తోంది. కర్ర విరగదు, పాము చావదు అన్న సామెత తరహాలో విభజన చట్టం ప్రకారమే హైకోర్టు ఏర్పాటు జరిగిందని చెబుతూనే, మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు సంప్రదింపుల తర్వాత ప్రతిపాదన పంపాలని సూచిస్తూ సమస్యను రాజేస్తోంది. రాజ్యసభలో గురువారం టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ఏపీ హైకోర్టు కర్నూలుకు తరలింపుపై కేంద్రం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉందా? అని వివరణ కోరారు. దీనిపై కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లిఖిత పూర్వక సమాధానమిస్తూ ఏపీ హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు మార్చే ప్రతిపాదనేది పెండింగ్‌లో లేదని స్పష్టం చేశారు.

మరోపక్క 2019 జనవరిలో రాష్ట్ర విభజన చట్టానికి అనుగుణంగా హైకోర్టును ఏర్పాటు చేశారని తెలియజేస్తూ, 2020 ఫిబ్రవరిలో కర్నూలుకు మార్చాలని సీఎం జగన్ ప్రతిపాదించారని తెలిపారు. దీనిపై హైకోర్టుతో రాష్ట్ర ప్రభుత్వమే సంప్రదించి నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుత హైకోర్టును కర్నూలుకు మార్చడంపై పూర్తి ప్రతిపాదన రావాలన్నారు.

హైకోర్టు, ప్రభుత్వం కలిపి తమకు ఉమ్మడి ప్రతిపాదన పంపుతాయని, ఆ తర్వాత కేంద్రం ఆమోదిస్తే హైకోర్టు నిర్వహణ ఖర్చు భరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు.

కేంద్రం నిర్లక్ష్యం వల్లే ధాన్యం మొలకలు

గత ఏడాది తెలంగాణ రైతాంగం పండించిన వరి ధాన్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయకపోవడంతో మొలకలు వచ్చాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ విమర్శించారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు దీనావస్థలోకి నెట్టివేయబడ్డారని, ఇందుకు ప్రభుత్వాలే కారణమని స్పష్టం చేశారు.

2లో

తదుపరి సీజేఐగా యూయూ లలిత్

- కేంద్రానికి జస్టిస్ ఎన్వీ రమణ సిఫార్సు
- రాష్ట్రపతి ఆమోదిస్తే 26న బాధ్యతల స్వీకరణ
- ఆపై మూడు నెలలే పదవీకాలం

న్యూదిల్లీ: భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ నియమితులుకానున్నారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖకు ప్రస్తుత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ లేఖ రాశారు. తన ప్రతిపాదనను కేంద్రంతో పాటు రాష్ట్రపతి ఆమోదిస్తే కొత్త సీజేఐగా జస్టిస్ యూయూ లలిత్ నియమితులవుతారు. సీజేఐగా జస్టిస్ ఎన్వీ రమణ పదవీకాలం ముగియనున్న క్రమంలో తదుపరి సీజేఐగా జస్టిస్ యూయూ లలిత్ పేరును సీనియారిటీ ఆధారంగా రమణ ప్రతిపాదించారు.

దీంతో 49వ సీజేఐగా జస్టిస్ యూయూ లలిత్ పదవీ బాధ్యతలు చేపట్టేందుకు దాదాపు రంగం సిద్ధమైంది. సీజేఐ రమణ పదవీకాలం ఈ నెల 25తో ముగుస్తుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీవిరమణ వయస్సు 65ఏళ్లు. జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్‌ను తదుపరి సీజేఐగా ప్రస్తుత సీజేఐ ఎన్వీ రమణ ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. ఈ ప్రతిపాదనకు కేంద్రంతో పాటు రాష్ట్రపతి ఆమోదం లభిస్తే జస్టిస్ లలిత్ బాధ్యతలు చేపడతారని వెల్లడించింది. ఈ నియామకంతో బార్ నుంచి నేరుగా సర్వోన్నత న్యాయస్థానం బెంచీకి పదోన్నతి పొందిన రెండవ సీజేఐగా జస్టిస్ లలిత్ నిలుస్తారు. 1971 జనవరిలో 13వ సీజేఐగా జస్టిస్ ఎస్ఎం సిక్రీ నియమితులయ్యారు. 1964 మార్చిలో అత్యున్నత న్యాయస్థానం

- మిగతా 2 లో

హైకోర్టుకు ఏడుగురు నూతన జడ్జీలు

ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ విశ్వభూషణ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా ఏడుగురు ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం కొత్త జడ్జీలతో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణం చేయించారు.

మొత్తం ఏడుగురు నూతనంగా ప్రమాణం చేయగా, వారిలో నలుగురు న్యాయమూర్తులుగా, ముగ్గురు అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. మొదటగా జస్టిస్ అడుసుమల్లి వెంకట రవీంద్రబాబు ప్రమాణం చేశారు. ఆ తర్వాత జస్టిస్ డాక్టర్ వక్కలగడ్డ రాధా కృష్ణ కృపా సాగర్, జస్టిస్ శ్యాంసుందర్ బండారు, జస్టిస్ శ్రీనివాస్ వూటుకూరు ప్రమాణం చేశారు. అదనపు న్యాయమూర్తులుగా జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీ నరసింహ చక్రవర్తి, తల్లాప్రగడ మల్లికార్జున రావు, దుప్పల వెంకట రమణ ప్రమాణస్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, జీఏడీ ముఖ్యకార్యదర్శి ఆర్. ముత్యాలరాజు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీ రావు, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో మరొకరి మృతి

విశాలాంధ్ర- ఎ.కొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో కిడ్నీ రోగుల మృత్యుఘోష ఆగడం లేదు. రెండు రోజుల క్రితం చీమలపాడు పెద్దతండాలో కిడ్నీ వ్యాధితో జరబల రాంబాబు మృతి చెందిన విషయం మరవక ముందే చీమలపాడు గ్రామానికి చెందిన ఇర్రి బాలసుందరం (57) బుధవారం అర్ధరాత్రి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చనిపోయాడు. మృతదేహాన్ని విజయవాడ ఆసుపత్రి నుండి చీమలపాడుకు తీసుకువచ్చారు. తనయుడు రవి తెలిపిన వివరాల ప్రకారం బాలసుందరం ఐదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఐదు నెలల నుండి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కిడ్నీ వైద్యం కోసం ఐదు లక్షల రూపాయలు ఖర్చు చేసినా తండ్రి దక్కలేదని రవి ఆవేదన చెందాడు. ప్రభుత్వం ఆదుకొని ఉంటే తన తండ్రి కొంతకాలం బ్రతికే వాడని చెప్పాడు. కిడ్నీ వ్యాధితో మంచం పట్టిన తనతండ్రిని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కానీ, ఆరోగ్యశాఖ అధికారులు కానీ పట్టించుకోలేదని ఆరోపించాడు. తమకు గల రెండెకరాల వ్యవసాయ భూమిని గతంలోనే అమ్ముకున్నామని, కూలి పనులతోనే తాము జీవిస్తున్నామని వివరించాడు. బాల సుందరానికి

- మిగతా 2 లో

విపక్షాలపై కేంద్రం కక్షసాధింపు

- ఈడీ చర్యలపై రాజ్యసభలో గళమెత్తిన కాంగ్రెస్
- తనకు సమన్లపై ఖర్గే నిలదీత
- సోనియాగాంధీ, రాహుల్ ఇళ్ల ఘెరావ్ ప్రస్తావన
- దర్యాప్తు సంస్థల కార్యకలాపాల్లో జోక్యం చేసుకోం: గోయల్
- రోజురోజుకు దిగజారుతున్న 'మోదీషాహీ': జైరాంరమేశ్
- ప్రతిపక్ష నేతల ఆందోళన నడుమ సభ నిర్వహణ

న్యూదిల్లీ : రాజకీయ కక్షసాధింపులో భాగంగా విపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను అస్త్రంగా కేంద్రం వాడుతోందని ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శించింది. తమ పార్టీ కార్యాలయాన్ని పోలీసులు ఘెరావ్ చేయడం, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నివాసాలను ముట్టడించడాన్ని ప్రస్తావించింది. పార్లమెంటు సమావేశాల వేళ తనకు ఈడీ సమన్లు అందాయని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తెలిపారు. మంత్రి పీయూష్ గోయల్ స్పందిస్తూ దర్యాప్తు సంస్థల కార్యకలాపాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోదన్నారు. చట్టాన్ని ఎదుర్కోవాలేగానీ పారిపోరాదు, పార్లమెంటును కొనసాగనివ్వండని కాంగ్రెస్ నేతలనుద్దేశించి అన్నారు. ప్రశ్నోత్తరాలప్పుడు ఈడీ చర్యలను ఖర్గే ప్రస్తావించారు. తమను భయపెట్టే ప్రయత్నం ఇదన్నారు. 'ఈ సభ కొనసాగుతోంది. నేను ప్రతిపక్షాల నాయకుడిని. ప్రస్తుతం ఈడీ ఎదుట హాజరు కావాలని సమన్లు వచ్చాయి. పార్లమెంటు సమావేశాలు జరుగుతుంటే సమన్లు జారీ చేయడం ఈడీకి ఎంత వరకు సమంజసం?' అని 'సిగ్గుసిగ్గు' అన్న నినాదాల నడుమ ప్రశ్నించారు. చట్టానికి కట్టుబడి ఉండే పౌరునిగా మధ్యాహ్నం 12.30 గంటలకు ఈడీ కార్యాలయానికి వెళతానని చెప్పారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నివాసాలను పోలీసులు ఘెరావ్ చేశారని ఖర్గే తెలిపారు. 'ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలదా? మనం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మరీ మా ఇళ్ల పక్కనే 'బార్' లు ఏర్పాటుచేసారుగా? అదెలా?

వైరస్‌తో వర్రీ!

విజృంభిస్తున్న కరోనా, డెంగీ

- ప్రతి ఇంటా జ్వర పీడితుడే
- రోగులతో ఆసుపత్రులు కిటకిట
- ఒల్లు, ఇల్లు గుల్ల చేస్తున్న వైద్యులు
- దోమల స్వైరవిహారం
- పారిశుధ్య నిర్వహణలో విఫలం
- అర్బన్ హెల్త్ సెంటర్లు బోర్డులకే పరిమితం

2లో

కరోనా రక్కసిని సాగనంపారని సంబరపడుతున్న వేళ తిరిగి కరాళనృత్యం చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో కేసులు పెరగడం కలవరపాటుకు గురిచేస్తోంది. డెంగీ, కరోనా లక్షణాలు ఒకే విధంగా ఉండడంతో ఏది సోకిందో తేల్చుకోలేక రోగులు గందరగోళానికి లోనవుతున్నారు. దీనికి తోడు వైరల్ ఫీవర్ వ్యాప్తి చెందడంతో ప్రతి ఇంట ఎవరో ఒకరు మంచం పట్టడం తప్పడం లేదు. రోజూ వందలాది మంది కేజీహెచ్, విమ్స్ కు క్యూకట్టడం నగరాన్ని నిద్రలేకుండా చేస్తోంది. ప్రైవేట్ ఆసుపత్రి తలుపు తడితే చాలు రోగి ఒల్లు, ఇల్లు గుల్ల చేస్తున్నారు. వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. వలంటీర్లు గుమ్మం తొక్కడం లేదని, అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యం అందని ద్రాక్షగా మారిందని ప్రజలు మండిపడుతున్నారు.

బడుగులకు కార్పొరేట్ విద్య



- 25శాతం సీట్ల కేటాయింపు
- ఉచిత విద్యాహక్కు చట్టం అమలు
- ఒకటో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ)-2009 కింద, విద్యార్థుల ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022-2కుగాను రెండు విడతలుగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్/కార్పొరేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాల అమలుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. ఆలస్యంగా వచ్చిన ఈ ఉత్తర్వులు అమలు సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2022-23 విద్యా సంవత్సరానికిగాను అన్ని ప్రైవేట్/అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో విద్యార్థులు చేరారు. చాలా ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీలోనే ప్రవేశాలు పొంది, ఆ తర్వాత ఒకటో తరగతిలోకి ప్రవేశిస్తారు. మరికొందరు ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందుతారు. ఇలా ప్రవేశాలు పొందిన వారితో ఆయా ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు ఇప్పటికే ఫీజులను నిర్ణయించి, నాలుగైదు దఫాలుగా వసూలు చేస్తున్నాయి. ఒకటో తరగతికి వచ్చిన విద్యార్థులకు ఇప్పటికే రెండు దఫాలుగా చాలా ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు వసూలు చేశారు. తరగతులు ప్రారంభమైనందున, కొత్తగా ఒకటో తరగతిలో చేరే పిల్లలు అతి తక్కువగా

- మిగతా 2 లో

ఆర్థికంపై ఆసియా మంత్రుల చర్చ

నామ్ పెన్: కరోనా వ్యాక్సిన్ పరిశోధన, ఉత్పత్తిలో ప్రాంతీయ సహకారాన్ని, ఆరోగ్య వ్యవస్థ మెరుగుదలకు 55వ ఆసియా సభ్య దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం(ఏఎమ్ఎమ్-55) పిలుపునిచ్చింది. కంబోడియాలోని నమ్ పెన్‌లో మూడురోజులపాటు జరిగే ఆసియా దేశాల విదేశాంగ మంత్రుల సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్న కంబోడియా ప్రధాని సామ్‌దేక్ టెకో హన్‌సెన్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థల పునరుద్ధరణ, ప్రాంతీయ భద్రత, మైన్మార్ అంశం, ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణ మార్పులు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. 'భిన్నత్వంలో ఏకత్వం" అనే స్పూర్తితో సమ్మిళిత, సహకార సంఘాన్ని నిర్మించడానికి కృషి చేయాలని హన్ సేన్ అన్నారు. ఆసియా దేశాలు సంఘీభావాన్ని కొనసాగించాలని, ఐక్యతతో వ్యవహరించాలని మంత్రులు అంగీకరించారు. అంతర్జాతీయ సహకారానికి సంబంధించి, ఆసియా దౌత్యవేత్తల కూటమి సమతుల్య విధానాన్ని తీసుకోవాలని, ఉమ్మడిగా ఉండాలని, ఆసియా దేశాల నేతృత్వంలోని యంత్రాంగాలను సమర్థవంతంగా ప్రోత్సహించాలని, చర్చలు జరపాలని, అంతర్జాతీయ చట్టాలతో విశ్వాసం, సమ్మతిని పెంచాలని నొక్కి చెప్పారు. మైన్మార్‌లో పరిస్థితిపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తూ, ఐదు అంశాల ఏకాభిప్రాయాన్ని అమలు చేయడాన్ని మంత్రులు స్వాగతించారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగా తీవ్రమైన ఆర్థిక పర్యవసానాలు ఎదురయ్యాయని, ఆహార, ఇంధన భద్రతకు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయని, మరోసారి ప్రపంచ దేశాలు చీలిపోయే ప్రమాదమేర్పడిందని హన్‌సెన్ పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత రెండేళ్ళలో మొదటిసారిగా ఆసియా విదేశాంగ మంత్రులు, వారి ప్రతినిధులు ముఖాముఖి సమావేశమయ్యారని కంబోడియా డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి ప్రాక్ సోకోనన్ చెప్పారు.

శాంతి, సుస్థిరతలకు విఘాతం కలిగిస్తే సహించం: చైనా

బీజింగ్: తైవాన్ జలసంధిలో శాంతి, సుస్థిరతలను భగ్నంచేస్తే ఉపేక్షించమని అమెరికా, తైవాన్లను చైనా హెచ్చరించింది. తైవాన్ అధ్యక్షురాలు త్సాయింగ్ వెన్, ఆమె నేతృత్వంలోని డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (డిపిపి) స్వాతంత్ర్యం కోసం బయటి మద్దతుపై ఆధారపడుతూ, అమెరికా చేతిలో పావుగా వ్యవహరిస్తున్నాయని జియావో గ్వాంగ్ విమర్శించారు. చైనాకు వ్యతిరేకంగా అమెరికా నిరంతరం చేస్తున్న యత్నాలను తాము సాగనివ్వమని స్పష్టం చేశారు. అమెరికా ప్రతినిధుల స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్‌లో పర్యటించడంపై చైనా తాజాగా బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించింది. తాజాగా చైనా ఈస్టన్ థియేటర్ కమాండ్ సెంటర్‌కు చెందిన రాకెట్ ఫోర్స్ సాంప్రదాయ మిస్సైల్ పరీక్ష చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ మీడియా ధ్రువీకరించింది. తైవాన్ చుట్టూ కొనసాగుతున్న పిఎల్ఎ విన్యాసాలు తాము చేసిన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, తైవాన్‌లో పర్యటనకు పెలోసి రావడాన్ని చైనా తీవ్రంగా పరిగణించింది డాంగ్‌ఫెంగ్ బాలిస్టిక్ మిస్సైళ్లను తైవాన్ నార్త్‌ఈస్ట్‌లో జలాల్లో ప్రయోగించినట్లు చైనా పేర్కొన్నది. తైవాన్ రక్షణ శాఖ కూడా ఈ మిస్సైళ్ల పరీక్షను ధ్రువీకరించింది. చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ డాంగ్‌ఫెంగ్ మిస్సైళ్లను ఆపరేట్ చేస్తుంది. ఆ క్షిపణులను ప్రయోగించిన సమయంలో తాము డిఫెన్స్ సిస్టమ్‌లను యాక్టివేట్ చేసినట్లు తైవాన్ రక్షణశాఖ పేర్కొంది. చైనా అక్రమ చర్యలకు పాల్పడుతోందని, ప్రాంతీయ శాంతికి ఇబ్బంది కలగచేస్తోందని తైవాన్ ఆరోపించింది. తైవాన్ ద్వీపానికి 12 నాటికల్ మైళ్లలోపు పిఎల్ఎ ఇంత భారీ ఎత్తున విన్యాసాలు నిర్వహించడం ఇదే ప్రథమం.

గ్రీస్‌లో హోచిమిన్ విగ్రహావిష్కరణ

కంబోడియా: వియత్నాం కమ్యూనిస్టు విప్లవకారుడు, రాజనీతిజ్ఞుడు హెూచిమిన్ గౌరవార్థం ఉత్తర గ్రీకు పట్టణం ఎడెస్సాలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు గ్రీస్ విదేశాంగ మంత్రి సోమవారం కంబోడియా రాజధాని హనోయిలో అధికారిక పర్యటనలో ప్రకటించారు. 'వియత్నాం వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు హెూచిమిన్, ఫ్రెంచ్ సైన్యంలో 1916-1917 కాలంలో పనిచేస్తున్న సందర్భంలో మాసిడోనియన్ ఫ్రంట్‌లో పోరాడారు. అందువల్ల, ఈ వాస్తవాన్ని హైలైట్ చేయడానికి ఎడెస్సాలో హెూచిమిన్ ప్రతిమను నిర్మించాలని అంగీకరించినట్లు పేర్కొన్నారు. 1954లో కమ్యూనిస్టు నేతృత్వంలోని డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాంకు నాయకత్వం వహించారు. 1954లో ఫ్రెంచ్ సైన్యాన్ని ఓడించడంతో మొదటి ఇండోచైనా యుద్ధం ముగిసింది. ఆయన 1955 నుండి 1975 వరకు కొనసాగిన అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన వియత్నాం ప్రజల పోరాటంలో హెచిమిన్ కీలక పాత్ర పోషించాడు. మార్క్సిస్ట్-లెనినిస్ట్, పీపుల్స్ ఆర్మీ ఆఫ్ వియత్నాం నాయకుడు, 1951 నుండి 1969 వరకు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వియత్నాం చైర్మన్‌గా హెూచిమిన్ దేశంలోని వలసవాద, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించి సోషలిజం నిర్మాణానికి పునాదులు వేశారు. హెూ చి మిన్ 1969లో మరణించాడు, 1976లో వియత్నాం ఏకీకృతమైంది. అయితే 20వ శతాబ్దపు గొప్ప సోషలిస్టు నాయకులలో ఒకరిగా ఆయన వారసత్వం సజీవంగా ఉంది, ఆయన ప్రపంచంలోని శ్రామికులంతా ఒకే కుటుంబంగా కలిసిపోవాలని ఆకాంక్షించారు.

తదుపరి సీజేఐగా యూయూ లలిత్

(మొదటిపేజీ తరువాయి)

బెంచీకి నియమితులైన తొలి న్యాయవాది ఆయన కాగా జస్టిస్ సిక్రీ వారసత్వాన్ని జస్టిస్ లలిత్ కొనసాగించనున్నారు. జస్టిస్ లలిత్ 2014, ఆగస్టు 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు. ట్రిపుల్ తలాక్‌పై తీర్పు వెలువరించిన ఐదుగురి ధర్మాసనంలో ఒకరిగా ఉన్నారు. కేరళలోని అనంత పద్మనాభస్వామి ఆలయం నిర్వహణ హక్కు ట్రావెన్‌కోర్ రాజకుటుంబానికి ఉంటుందని జస్టిస్ లలిత్ నేతృత్వ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. పోక్సో చట్టం కింద 'స్కిన్ టు స్కిన్' వ్యవహారం వంటి అనేక కేసుల్లో కీలక తీర్పుల్లోనూ జస్టిస్ లలిత్ భాగస్వామిగా ఉన్నారు. జస్టిస్ లలిత్ 1957, నవంబరు 9న జన్మించారు. 1983, జూన్‌లో న్యాయవాద వృత్తిలోకి వచ్చారు. 1985 డిసెంబరు వరకు బాంబే హైకోర్టు న్యాయవాదిగా ఉన్నారు. 1986 జనవరిలో దిల్లీలో ప్రాక్టీస్ పెట్టారు. 2004 ఏప్రిల్‌లో సర్వోన్నత న్యాయస్థానం సీనియర్ అడ్వకేట్ అయ్యారు. 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం కేసులో సీబీఐ విచారణ కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు. జస్టిస్ లలిత్ కొత్త సీజేఐగా నియమితులు అయితే మూడునెలల పాటు పదవిలో ఉంటారు. ఈ ఏడాది నవంబరు 8న ఆయన పదవీ విరమణ చేయనున్నారు.

కిడ్నీ వ్యాధితో మరొకరి మృతి

(మొదటిపేజీ తరువాయి)

ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. మృతుని భార్య విజయమ్మ గతంలోనే మృతి చెందింది. మట్టి ఖర్చుల నిమిత్తం ఎ.కొండూరు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావు, ఆర్ఐ స్రవంతి మృతుని కుమారుడికి 11 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు జడ్‌పీటీసీ భూక్యా గనియా, పీఏసీఎస్ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, వార్డు మెంబర్లు ఎం.జయరాజు, ఎం.నాగరాజు, వీఆర్వో మీరా, మహిళ కానిస్టేబుల్ లక్ష్మీ తిరుపతమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

విపక్షాలపై కేంద్రం కక్షసాధింపు

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగబద్ధంగా పనిచేయగలమా? మమ్మల్ని అధైర్యపర్చాలని, నాశనం చేయాలని, భయపెట్టాలనే ఇదంతా చేస్తున్నారు. మేము బెదిరింపులకు లొంగం.. భయపడం.. ప్రతిఘటిస్తాం' అని ఖర్గే అన్నారు. ఈ అంశంపై సభలో చర్చకు డిమాండు చేశారు. పార్లమెంటు సమావేశం మధ్యలో ఈడీ సమన్లు ఖర్గేకు అందడంతో 'మోదీషాహీ' దిగజారుడు రాజకీయాలను అర్థంచేసుకోవచ్చు అని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ట్విట్టర్ మాధ్యమంగానూ విమర్శలు చేశారు. రమేశ్ వ్యాఖ్యలకు గోయల్ స్పందించారు. అధికారంలో ఉన్నప్పుడు దర్యాప్తు సంస్థల కార్యకలాపాల్లో జోక్యం చేసుకున్నది కాంగ్రెస్సేగానీ తమ ప్రభుత్వం కాదని అన్నారు. 'తప్పు చేసినట్లు రుజువు అయితే చట్టం దాని పనిని అది చేసుకుపోతుంది. ఎల్ఓపీ చెప్పినవన్నీ నిరాధారం. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. కాంగ్రెస్ నేతలు బెయిల్‌పై ఉన్నారు. కాంగ్రెస్ నేతలు, ఎల్ఓపీ చట్టాన్ని అనుసరించాలేగానీ పారిపోరాదు' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతలు వెల్‌లోకి దూసుకెళ్లి పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభ్యుల నిరసన మధ్య ప్రశ్నోత్తరాలను సభాపతి నిర్వహించారు. తమ స్థానాల్లో కూర్చోవాలని సభాపతిగా వ్యవహరించిన వి.విజయసాయి రెడ్డి అనేకమార్లు సూచించారు. 'వెల్‌లోకి రావద్దు.. పోడియం ముందర నిలుచోవద్దు. మీ స్థానాలకు వెళ్లండి' అని కోరారుగానీ విపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు.

సుప్రీంకోర్టులో 71 వేలకు పైగా అపరిష్కృత కేసులు

న్యూదిల్లీ: సుప్రీంకోర్టులో ఏళ్ల తరబడి విచారణకు నోచుకోని కేసుల సంఖ్య 71వేలకు పైగానే ఉంది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం గురువారం రాజ్యసభకు తెలియజేసింది. దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగస్టు 2 నాటికి 71,411 కేసులు అపరిష్కృతంగా ఉండగా, ఇందులో 56 వేల సివిల్ కేసులు ,15 వేలకు పైగా క్రిమినల్ కేసులు ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. పరిష్కారం గాని మొత్తం 71,411 కేసుల్లో పదేళ్లకు పైగా 10,491 కేసులు, ఐదేళ్ల లోపు 42 వేల కేసులు, ఐదు నుంచి 10 ఏళ్ల మధ్య 18,134 కేసులు ఉన్నట్లు వివరించారు. 2016లో హైకోర్టుల్లో 40,28,591 కేసులు అపరిష్కృతంగా ఉండగా, ఈ ఏడాది జులై 29 నాటికి వాటి సంఖ్య 50 శాతం పెరిగి 59,55,907కు చేరిందని మరో ప్రశ్నకు సమాధానంగా రిజిజు వెల్లడించారు. జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో కూడా 2016 నుంచి ఈ ఏడాది జులై 29 మధ్య కేసుల సంఖ్య 50 శాతం పెరిగా యి. 2016లో 2.82 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉండగా, ఈ ఏడాది 4.24 కోట్లకు పైగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కోర్టుల్లో కేసుల పరిష్కారం న్యాయవ్యవస్థ పరిధిలో ఉంటుంది. వివిధ కోర్టులలో కేసుల దాఖలు, పరిష్కార మనేది నిరంతర ప్రక్రియ అయినప్పటికీ, ఆయా కోర్టులు వివిధ రకాల కేసుల పరిష్కారానికి ఎటువంటి కాలపరిమితిని నిర్దేశించలేదని మంత్రి చెప్పారు.

అచ్యుతాపురం సెజ్ ప్రమాదాలు అరికట్టలేరా?: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అచ్యుతాపురం సెజ్ ప్రమాదాలను ప్రభుత్వం అరికట్టలేదా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. విశాఖ సమీపంలో ఉన్న ఎస్ఈజెడ్ పారిశ్రామిక ప్రాంతంలో తరుచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదం ఎంతటి విధ్వంసాన్ని సృష్టించిందో, ఎంతమంది ప్రాణాలను హరించిందో, వందలాది మందిని శాశ్వత అనారోగ్యానికి గురి చేసిందో ఎప్పటికీ మరచిపోలేమని అన్నారు. సెజ్‌లో మంగళవారం దుస్తులు తయారుచేసే సీడ్స్ అనే కంపెనీలో విషవాయువు లీకై 125 మంది మహిళలు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లిప్తతే కారణమని పేర్కొన్నారు. ఇదే కంపెనీలో నెల క్రితం ఇలాంటి ప్రమాదం జరిగిందని, అప్పుడు 400 మంది అస్వస్థతకు గురయ్యారనీ, ఇది మళ్లీ పునరావృతమైందని అన్నారు. ప్రమాదానికి కారణాలు ఏమిటో అటు అధికారులుగాని, ఇటు కంపెనీ ప్రతినిధులుగాని చెప్పకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. అస్వస్థులైన మహిళా కార్మికులకు ప్రభుత్వం నాణ్యమైన వైద్యం, నష్ట పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

వైరస్‌తో వర్రీ!

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కరోనా మహమ్మారి పీడ తొలగిపోయిందని అందరూ మాస్కులు తీసేసి స్వేచ్ఛగా విహరిస్తున్న వేళ మళ్లీ కేసులు అధికమవుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. విశాఖలో కరోనా కేసులు రోజు రోజుకీ పెరుగుతుండడం, గడిచిన 24 గంటల్లో 50 కేసులు నమోదుకావడంతో ప్రజలు కలవరపాటుకు లోనవుతున్నారు. జిల్లాలో మొత్తం 250 యాక్టివ్ కేసులున్నట్టు అధికార వర్గాలు తెలపడంతో ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. దీనికి తోడు నగరంలో వైరల్ జ్వరాలు ... ముఖ్యంగా డెంగీ విజృంభిస్తోంది. ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతూనే ఉన్నారు. సోమవారం విశాఖలో 215 డెంగీ, 120 మలేరియా కేసులు వున్నట్లు అధికారికంగా ప్రకటించారు. వీటి లక్షణాలు దాదాపు ఒకేలా ఉంటుండటం మరింత గందరగోళానికి తావిస్తోంది. వైరల్ ఫీవర్ లక్షణాలతో రోజూ వందలాదిమంది కేజీహెచ్, విమ్స్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్‌కు పెద్ద సంఖ్యలో జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దోమల వ్యాప్తి అధికమైంది. వాతావరణంలో మార్పుల వల్ల వైరల్ ఫీవర్ వ్యాప్తి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. కరోనా, డెంగీ లక్షణాలు ఒకే విధంగా ఉండడంతో తమకు ఏ వైరస్ సోకిందో తెలియక సతమతమౌతున్నారు. రోగి లక్షణాల ఆధారంగా ఏది కరోనా, ఏది డెంగీ, ఏది వైరల్ ఫీవరో అంచనా వేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఏటా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విఫలం చెందుతున్నారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ విశాఖ అంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప ఆచరణలో ఆమడదూరంలో ఉంటున్నారు. నగరంలో పారిశుధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సి ఉన్నా ఆ మేర ప్రయత్నాలు సంపూర్ణంగా జరగడం లేదు. మురుగుపై బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినస్తున్నాయి. జిల్లాలో ఏ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించినా చలితో వణికి పోయే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రైవేట్ ఆస్పత్రులు వ్యాపార కేంద్రాలుగా మారాయి. రోగి వస్తే చాలు డబ్బు గుంజడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ఒళ్లు, ఇల్లు గుల్లకాక తప్పడం లేదు. వలంటీర్లు ఇంటి గుమ్మం కూడా తాకడం లేదని, సచివాలయ సిబ్బంది పేరుకే ఉన్నారని, అర్బన్ హెల్త్ సెంటర్ ల పేరిట బోర్డులు పెట్టారు తప్ప వైద్య సదుపాయాలు లేవని ప్రజలు మండిపడుతున్నారు.

బడుగులకు కార్పొరేట్ విద్య

(మొదటిపేజీ తరువాయి)

ఉంటారు. దీంతో ఎల్‌కేజీ, యూకేజీ నుంచి ఒకటో తరగతిలోకి ప్రవేశించిన పిల్లలే అత్యధికంగా ఉంటారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన బడుగుల పిల్లలు, అక్కడ మానేసి ప్రైవేట్ పాఠశాలల్లోకి చేరే ప్రమాదముంది. దీనివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో క్రమేపీ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ఆస్కారమూ ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్యాహక్కు చట్టం కింద అర్హులైన వారిని పాఠశాల యాజమాన్యం ద్వారా తల్లిదండ్రులకు సమాచారం పంపేలా ప్రభుత్వం ఆదేశించాలి. అర్హులైన వారి తల్లిదండ్రుల పిల్లలతో ఆన్‌లైన్లో దరఖాస్తు చేయించేలా విద్యాశాఖాధికారులు కృషి చేస్తేనే ఈ పథకం ముందుకు కొనసాగుతుంది. లేకుంటే ఒకటో తరగతిలో చేరే విద్యార్థులు అతి తక్కువగా ఉంటారు.

బడుగులకు 25 శాతం సీట్ల విభజన ఇలా..

ఉచిత నిర్బంధ విద్యకు సంబంధించి బాలల హక్కు చట్టం-2009లో 12(1)(సీ)ను అమలు చేయడానికి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరిస్తూ, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి విద్యార్థుల నమోదులో 25శాతం సీట్లు కేటాయించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథ, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగు పిల్లల కోసం 5శాతం సీట్లు, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాలు(బీసీ, మైనార్టీ, ఓసీ)కి చెందిన పిల్లలకు 6శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత కలిగిన పిల్లలు 1వ తరగతి నమోదులో 25శాతంసీట్లు కేటాయించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన ప్రవేశాలు కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల వార్షిక ఆదాయం రూ.లక్షా 20వేలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే బాలహీన వర్గాల వార్షికాదాయం లక్షా 40వేలను ప్రాతిపదికగా తీసుకుని, వారి కుటుంబాల పిల్లలను అర్హులుగా నిర్ణయిస్తారు.

రెండు విడతలుగా ప్రవేశాలు

విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో ఈనెల 16వ తేదీ నుంచి 26వరకు ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 30వ తేదీన లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు. మొదటి ఎంపిక జాబితాను సెప్టెంబరు 2న ప్రకటిస్తారు. సెప్టెంబరు 2 నుంచి 9వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. మిగిలిపోయిన సీట్లను రెండో జాబితాలో భర్తీ చేస్తారు. రెండో జాబితాను సెప్టెంబరు 12 నుంచి 30వరకు నిర్వహిస్తారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెల రోజులు గడుస్తోంది. ఈ సమయంలో అంతా ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలోకి చేరారు. ఈ సమయంలో వారికి ప్రవేశాలు ఎలా కల్పిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. పథకం అమలులో ఎలాంటి సాంకేతిక తప్పిదాలు లేకుండా, ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ప్రమాదం తలెత్తకుండా విద్యాశాఖాధికారులు సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్రం నిర్లక్ష్యం వల్లే ధాన్యం మొలకలు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సీపీఐ కార్యదర్శి నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్ : గత ఏడాది తెలంగాణ రైతాంగం పండించిన వరి ధాన్యాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయకపోవడంతో మొలకలు వచ్చాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ విమర్శించారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు దీనావస్థలోకి నెట్టివేయబడ్డారని, ఇందుకు ప్రభుత్వాలే కారణమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండిన ప్రతి గింజను కొంటామని బీజేపీ నేతలు ప్రచారం చేస్తుంటే కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పండిన ధాన్యం మొలకలు ఎత్తిన వీడియోను ప్రదర్శిస్తూ కేంద్రం తీరుపై ధ్వజమెత్తారు. కేంద్రం కొనాల్సిన అసరాన్ని ప్రస్తావిస్తూ సీఎం కేసీఆర్ తంటాలు పడుతున్నారని పేర్కొన్నారు.

ప్రజల ఆహార అవసరాలకు వినియోగించాల్సిన ధాన్యాన్ని కొనకపోవడంతో మొలకలు వచ్చి నాశనం అవుతుంటే అన్నదాతల కడుపుమండుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతూ కేంద్ర ప్రభుత్వం అన్నదాతల మెడకు ఉరి వేస్తోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్షం కారణంగానే ధాన్యం మొలకలెత్తే పరిస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. దీనికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమన్నారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేని రైతు వ్యతిరేక ప్రభుత్వం అంటూ బీజేపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో దేశానికి బీజేపీ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని, నష్టపోయిన అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు.

బ్యాంకు మోసం కేసులో రూ.40 కోట్ల ఆస్తుల జప్తు

న్యూదిల్లీ: రుణాలు తీసుకుని బ్యాంకును మోసగించిన కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ విచారణలో బెంగళూరుకు చెందిన ఓ కంపెనీకి చెందిన రూ.40 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. కవ్వేరీ టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు చెందిన నివాసిత సముదాయాలు, స్థలాలు, వ్యవసాయ భూములు, బ్యాంకు డిపాజిట్లను జప్తు చేయడానికి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఈ మొత్తం ఆస్తుల విలువను రూ.40.14 కోట్లుగా పేర్కొంది. బెంగళూరులో ఈ కంపెనీ, దాని ప్రమోటర్లపె సీబీఐ 2015 జులైలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ మనీలాండరింగ్ కేసు నమోదైంది. తాము తీసుకున్న రుణానికి సంబంధించి కంపెనీ, దాని డైరెక్టర్లు బ్యాంకును మోసం చేశారంటూ అప్పటి దేనా బ్యాంక్ డీజీఎం దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఈడీ తెలిపింది. పరికరాల కొనుగోలు పేరుతో కంపెనీ, దాని డైరెక్టర్లు గతంలో దేనా బ్యాంకు నుంచి రూ.45 కోట్ల మేర రుణాలు తీసుకుని పక్కదారి పట్టించారని పేర్కొంది.

దేశంలో 19 వేలకుపైగా కరోనా కొత్త కేసులు

న్యూదిల్లీ: దేశంలో కరోనా కేసుల వ్యాప్తి పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం గడచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 19,893 మంది వైరస్ బారిన పడగా, 53 మంది ప్రాణాలు కోల్పోయారు. పాజిటివిటీ రేటు 4.94శాతంగా నమోదైంది. కాగా 24 గంటల వ్యవధిలో కరోనా నుంచి 20,419 మంది కోలుకున్నారు. రికవరీ రేటు 98.50 శాతానికి పెరిగింది. క్రియాశీల కేసులు 0.31శాతంగా ఉన్నాయి. ఇప్పటి వరకు దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 4,40,19,811 కాగా, మొత్తం మరణాలు: 5,26,530, క్రియాశీల కేసులు: 1,36,478, కోలుకున్నవారి సంఖ్య: 4,34,24,029. దేశంలో బుధవారం 38,20,676 మందికి కరోనా నివారణ వాక్సిన్ డోసులు అందించగా, ఇప్పటివరకు పంపిణీ చేసిన వాక్సిన్ డోసుల సంఖ్య 205.22 కోట్లు దాటింది. మరో 4,03,006 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేశారు. తాజాగా నమోదైన 53 మరణాల్లో మహారాష్ట్రలో అత్యధికంగా 7, దిల్లీ-5, అసోం, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో 4 చొప్పున, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో 3 చొప్పున, కర్ణాటక-2, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, కేరళ, మేఘాలయ, తమిళనాడు, ఉత్తప్రదేశ్‌ల్లో ఒకటి చొప్పున మరణాలు సంభవించాయి.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: ప్రతిపక్ష నేతగా చేపట్టిన పాదయాత్రలో అగ్రిగోల్డు బాధితులకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు సీఎం జగన్‌ను డిమాండు చేశారు. ఈ మేరకు గురువారం విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అగ్రిగోల్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రూ. 20,వేల లోపు నష్టపోయిన పరిహారం అందకుండా మిగిలిపోయిన బాధితులకు తక్షణమే న్యాయం చేయాలన్నారు. అగ్రిగోల్డు మోసానికి ఆత్మహత్యలు చేసుకున్న బాధితుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. సానుకూలంగా స్పందించిన జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం. సూరప్పడు, ఎం. శ్రీనివాసరావు, యల్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్‌పై సస్పెన్షన్ వేటు ?

(మొదటిపేజీ తరువాయి)

గోరంట్ల మాత్రం దీనిని ప్రతిపక్ష టీడీపీ నేతల కుట్రగా ఆరోపిస్తున్నారు. తాను ఎక్సర్‌సైజ్ చేసే వీడియోను మార్ఫింగ్ చేశారని, దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు, అవసరమైతే న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకు వెళతానని మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షనేతలను హెచ్చరించారు. బాధ్యత గల ఎంపీగా ఉంటూ ఇలా అసభ్యకరంగా ప్రవర్తించడంపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. అత్యంత గౌరవప్రదమైన పదవిలో ఉంటూ అత్యంత జుగుప్సాకరమైన ఈ రాసలీలల వీడియోలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎంపీ పదవికి మాధవ్ రాజీనామా చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా ఎంపీ తీరు ఉందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఒక ఎంపీయే ఈ విధంగా ప్రవర్తించడం వైసీపీ దుర్మార్గాలు పరాకాష్ఠకు చేరాయనడానికి నిదర్శనంగా పేర్కొన్నారు. గోరంట్ల మాధవ్ అరాచకాలకు అడ్డులేకుండా పోతోందని, ప్రశ్నించిన వారిపైనే ఆయన అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి మహిళల పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా తక్షణమే గోరంట్ల మాధవ్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అనిత డిమాండ్ చేశారు. అడ్డంగా దొరికినా ఇంకా గోరంట్ల మాధవ్ బుకాయిస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఎక్సర్‌సైజులు చేసేవారు ఎవరైనా బట్టల్లేకుండా చేస్తారా ? అని ప్రశ్నించారు. ఎంపీ గోరంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి జోగి రమేశ్ కూడా మహిళా వాలంటీర్లను లైంగికంగా వేధిస్తున్నారని బోండా ఆరోపించారు. గోరంట్ల మాధవ్ చేసిన పనితో సభ్యసమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి పీతల సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అవంతి శ్రీనివాస్, అంబటి రాంబాబులపై ఇటువంటి ఆరోపణలు వచ్చినప్పుడు చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుతం గోరంట్ల ఇంత బరితెగించేవారు కాదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి గోరంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మహిళల సత్తా ఏమిటో చూపుతామని పీతల హెచ్చరించారు.

'వాసిరెడ్డి' పురస్కారానికి కవితా సంపుటాల ఆహ్వానం

విశాలాంధ్ర-వరంగల్: ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారానికి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్టు అరసం వరంగల్ అధ్యక్షుడు నిధి, ప్రధాన కార్యదర్శి పల్లేరు వీరస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాదీ ఒక్కో సాహిత్య ప్రక్రియకు 'వాసిరెడ్డి' స్మారక సాహిత్య పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. 2022 సంవత్సరానికిగాను కవిత్వానికి పురస్కారం ప్రదానం చేయడానికి నిర్ణయించినట్టు చెప్పారు. సంపుటాలు మాత్రమే పంపాలని, సంకలనాలు స్వీకరించబడవని తెలిపారు. వచన, గేయ కవితా సంపుటాలు, దీర్ఘ కవితలు పంపవచ్చునన్నారు. 2018 జూలై నుంచి 2022 జూన్ వరకు ప్రచురించినవై ఉండాలన్నారు. మొదటి ముద్రణలు నాలుగు ప్రతులు పంపాలనీ, ప్రతులు ఈ నెల 31లోపు అందజేయాలన్నారు. ఎంపికైన గ్రంథకర్తను అక్టోబరులో హనుమకొండలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రూ.5000 నగదు, శాలువ, జ్ఞాపికతో సత్కరిస్తామని వివరించారు. ప్రతులను... చందనాల సుమిత్ర, ఇంటి నెంబర్ 5-11-902, హనుమాన్‌నగర్, పెగడపల్లి క్రాస్ రోడ్, హనమకొండ-506009 చిరునామాకు సకాలంలో పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9701000306, 9441602605, 9550217802 సంప్రదించాలన్నారు.

హోదాకోసం కలిసి అడుగేద్దాం

- పాదయాత్ర అక్టోబర్‌కు మార్పు
- జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ భాగస్వాములు కావాలి
- ప్రత్యేక తరగతి హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్

మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్. పక్కన అజయ్‌కుమార్, మల్లికార్జునరావు, నరసింహారావు, మాల్యాద్రి తదితరులు

విశాలాంధ్ర-గుంటూరు: హోదా, విభజన హామీలను సాధించుకునేందుకు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి రావాలని, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని, హక్కులను కాపాడుకోవాలని హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 97 శాతం మంది ప్రజలు ఏపీకి మోదీ అండ్ కంపెనీ చేసిన ద్రోహాన్ని వ్యతిరేకిస్తుంటే, 97 శాతం ఓట్లు తెచ్చుకున్న రాజకీయ పార్టీలు మాత్రం రాష్ట్ర హక్కులు, ఆత్మగౌరవాన్ని మోదీ పాదాల వద్ద తాకట్టు పెడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లోని పార్టీలు వారి ఆత్మగౌరవం కోసం కేంద్రానికి ఎదుర్కొడ్డి నిలబడుతున్నారని, మన రాష్ట్ర నాయకులకు ఏమైందని ప్రశ్నించారు. హోదా ఉద్యమం ఆగలేదని, కన్నెగంటి హనుమంతు, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల స్ఫూర్తితో ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి తమ సమితి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. హోదా, విభజన హామీల అమలు కోసం హిందూపూర్ నుంచి ఇచ్ఛాపురం వరకు ఆగస్టులో తలపెట్టిన పాదయాత్ర అనివార్యకారణాల వల్ల అక్టోబర్‌కు వాయిదా వేశామన్నారు. ఆలోగా అన్ని ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లను పాదయాత్రకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర నాయకులు నిద్రపోతున్నారా

రాష్ట్రంలోని ప్రముఖ సంస్థలను గుజరాత్‌కు తరలిస్తుంటే రాష్ట్ర నాయకులు నిద్రపోతున్నారా అంటూ చలసాని ప్రశ్నించారు. రాష్ట్రంలోని యువత భవిష్యత్ ఏమైపోతుందని నిలదీశారు. తెలుగుజాతి త్యాగ ఫలితంగా ఏర్పాటు చేసుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెడుతున్న కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం చేతిలో పావులుగా మారవద్దని హితవుపలికారు. ఒకరిపై ఒకరిని రెచ్చగొట్టి పబ్బంగడుపుకుంటున్న కేంద్రం రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదేనా మేక్ ఇన్ ఇండియా

'ఇతర దేశాల నుంచి దిగుమతులు చేసుకోవడమేనా మేక్ ఇన్ ఇండియా అంటే' అని చలసాని ప్రశ్నించారు. జాతీయ జెండాను కూడా తయారు చేసే సామర్థ్యం మన దేశానికి లేదంటున్న కేంద్ర మంత్రి ఆ పదవి అర్హుడేనా అంటూ నిలదీశారు. జాతీయ జెండాను డీపీగా పెట్టుకోవాలనే ఉచిత సలహాలు మానుకుని దేశంలో ఖాళీగా ఉన్న చేనేత కార్మికుల చేత జాతీయ జెండాను తయారు చేయించాలన్నారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఉత్తరాది రాష్ట్రాలకు ప్రధానిగా వ్యవహరిస్తూ దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి హోదా ఇస్తామని, ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా చట్టంలో ఉన్న హామీలను అమలు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే ప్రశ్నించాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. సమితి ఆధ్వర్యంలో తలపెట్టనున్న పాదయాత్రలో ప్రజానీకం పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమితి నాయకులు తాటికొండ నరసింహారావు, కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బయోటెక్ పరిశ్రమలో ప్రమాదం: ఇద్దరి మృతి

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లిలోని పరమేశు బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో గురువారం తెల్లవారు జామున ప్రమాదం సంభవించింది. ముగ్గురు వ్యక్తులు అస్వస్థకు గురయ్యారు. వీరిని దేవరపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొవ్వూరు ఆసుపత్రికి తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులు మార్గమధ్యంలో మృతి చెందారు. మరో వ్యక్తి రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ బీ శ్రీనాథ్, సీఐ ఏ శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ శ్రీనాథ్ మాట్లాడుతూ దేవరపల్లిలో గల పరమేశు బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీలో ఫిల్టర్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. వీరిని దేవరపల్లి ఆసుపత్రి తరలించారని, పరిస్థితి విషమంగా ఉండడంతో కొవ్వూరు ఆస్పత్రికి తరలిస్తుండగా ఒడిశాకు చెందిన దామా బీరువా, తాళ్లపూడి మండలం తిరుగుడ మెట్టకు చెందిన గాజుల శ్రీనివాస్ మార్గమధ్యంలో మృతి చెందారన్నారు. మరో వ్యక్తి అనిల్ సింగ్ రాజమండ్రి ఆసుపత్రిలో తరలించి చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేపడతామన్నారు. దేవరపల్లి పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ రామకృష్ణ, జిల్లా పరిశ్రమల అధికారి వెంకటేశ్వరరావు, పొల్యూషన్ అధికారులు పాల్గొన్నారు.

7న అరసం కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 7వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు గుంటూరు-బ్రాడీపేట ఎన్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ మేరకు అరసం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరు శివప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, సభ్యులు హాజరవుతారు.

22 నుంచి ఎస్‌ఆర్‌ఎంలో కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి నాలుగు వారాలపాటు గ్రామీణ నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వీసీ ఆచార్య వజ్జా సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇన్‌స్టిట్యూషనల్ సోషల్ రెస్పాన్స్' కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఫ్రంట్ ఎండ్ డెవలప్‌మెంట్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్ కోర్సుల ద్వారా వెబ్ డిజైన్ ప్రిన్సిపుల్స్, హెచ్‌ఎంఎల్, కాస్కాడింగ్ స్టైల్ షీట్స్, జావా స్క్రిప్ట్, ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ పవర్ పాయింట్, ఇంటర్నెట్ టెక్నాలజీ కోర్సుల్లో సమగ్ర శిక్షణ అందిస్తామని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజూ సాయంత్రం 5 నుంచి 6.30 గంటల మధ్య శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. డాక్టర్ దినేశ్ రెడ్డి కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ, ఇంజినీరింగ్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ టి.రఘునాథన్, డీన్ డాక్టర్ బీవీ బాబు పర్యవేక్షిస్తారని వివరించారు. ఆసక్తిగల యువతీ యువకులు 9603619192 నంబరుకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని చెప్పారు.

ముంపు మండలాల్లో ప్రజాశక్తి వైద్యశిబిరాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ముంపు మండలాల నిర్వాసితులకు ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని ప్రజాశక్తి పూర్వ సంపాదకులు వి.శ్రీనివాసరావు వెల్లడించారు. ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్‌తో కలిసి విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైద్యులు రమేష్, సుమన్ బాబు నేతృత్వంలో బయలు దేరిన వైద్య బృందాల వాహనానికి జెండా ఊపారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ గోదావరి వరదలతో అనారోగ్యం పాలైన బాధితులకు నెల్లూరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల వైద్యుల బృందం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఉచిత శిబిరాలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందుల పంపిణీ ఉంటుందన్నారు. పోలవరం ముంపు మండలాల్లోని చింతూరు, విఆర్‌పురం, ఎటపాక, కూనవరం మండలాల్లోని వందలాది గ్రామాల్లోని ప్రజలు వైద్యం కోసం ఎదురుచూస్తున్నారని వెల్లడించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి: రామచంద్రయ్య

మాట్లాడుతున్న రామచంద్రయ్య. వేదికపై రామాంజనేయులు, లలితమ్మ, గిడ్డయ్య, రసూల్ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విశాఖపట్నంలో ఈనెల 26 నుంచి 28 వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీ రామచంద్రయ్య, కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. జె.లలితమ్మ అధ్యక్షత వహించగా, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు ఎస్.ఎన్.రసూల్, ఎస్.మునియప్ప హాజరయ్యారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రామచంద్రయ్య విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తోందనీ, మతం పేరుతో దేశంలోని ముస్లింలు, క్రైస్తవులపైన దాడులు చేస్తూ హిందూత్వాన్ని అమలు చేస్తోందని, దేశ లౌకికత్వానికి తూట్లు పొడుస్తుందని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, పెట్రో ఉత్పత్తులను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. ఇక రాష్ట్రంలో సంక్షేమ పథకాల పేరులో సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని, కరెంటు చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, ఇంటి పనులు, చెత్త పన్ను అన్ని రకాల పన్నులు పెంచడం ద్వారా ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపారని, రాష్ట్ర విభజన హామీలను అమలు పరచడంలో, హోదా తీసుకురావడంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులను సమకూర్చడంలో కేంద్ర ప్రభుత్వంతో తెగించి మాట్లాడలేని పరిస్థితుల్లో జగన్ ప్రభుత్వం ఉందని, రాష్ట్రంలో ఎక్కడ కొత్త పరిశ్రమల్ని ఏర్పాటు చేయలేదని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఈనెల 26 నుంచి 28 వరకు విశాఖపట్నంలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలో ప్రజా, రైతు, కార్మిక సమస్యలను చర్చించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలని నిర్ణయించనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్, పీ రామకృష్ణారెడ్డి, రాజు, రంగన్న, శ్రీరాములు, కారుమంచి, పంపన్న గౌడ్, అజయ్ బాబు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఐపీపీబీ' ప్రతిపాదనను వ్యతిరేకిద్దాం

10న పోస్టల్ సమ్మెను జయప్రదం చేయండి

పీజేసీఏ నేతలు రామకృష్ణ, జోషెఫ్‌కుమార్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చిన్నమొత్తాల పొదుపు పథకాల అకౌంట్లను ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) లోకి బదిలీ చేయాలనే ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఈనెల 10న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో పోస్టల్ ఉద్యోగులంతా పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పీజేసీఏ ఏపీ చైర్మన్ ఎం.రామకృష్ణ, కన్వీనర్ ఎన్.జోషెప్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల్లో భాగంగా గత ఏడు సంవత్సరాల కాలంలో దాదాపు 232 ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటీకరణకు గురై కార్పొరేట్ల ధనదాహానికి ఆహుతయ్యాయన్నారు. ప్రస్తుతం తపాలా శాఖ గమనం కూడా అదే బాటలో సాగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పోస్టాఫీసులపై ఉన్న నమ్మకంతో ప్రజలు 29 కోట్ల చిన్న మొత్తాల పొదుపు ఖాతాల ద్వారా సాలీనా దాదాపు లక్ష కోట్లు లావా దేవీలు చేస్తున్నారన్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు వచ్చే ఆదాయంలో సుమారు 64 శాతం ఈ అకౌంట్ల నిర్వహణ ద్వారా వచ్చే కమీషనేనని, ఇప్పుడు ఈ ఆదాయ మంతా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకుకు తరలిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పొదుపు ఖాతాల ద్వారా జరిపే డిపాజిట్‌లు, విత్‌డ్రాయల్స్, ఏటీఎం వంటి కార్యకలాపాలకు సర్వీస్ ఛార్జీలు లేవు కాని ఐపీపీబీలో ఇప్పటికే అనేక సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీతో కలిపి ప్రజలను పిండేస్తున్నారన్నారనీ ప్రజలకు ఇది చాలా నష్టదాయకమైన చర్యని వారు పేర్కొన్నారు. అతి తక్కువ ప్రీమియం, అత్యధిక బోనస్ నినాదంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా సేవలందిస్తూ సాలీనా రూ.1000 కోట్ల ఆదాయం ఆర్జిస్తున్న తపాలా జీవిత బీమా (పీఎల్‌ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్‌ఐ)లను ఐపీపీబీ కిందకు తీసుకురావడం కూడా ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనన్నారు. ప్రైవేటీకరణ వల్ల వచ్చే దుష్పరిణామాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి సంస్థను కాపాడుకునేందుకు పోస్టల్ ఉద్యోగులంతా పోరాటానికి సిద్ధం కావాలని వారు కోరారు.

నాలుగు శతాబ్దాలు కళావైభవాన్ని చాటిన

కొయ్య రథాన్ని పరిరక్షించుకుందాం

పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: వెలుగులీనుతూ కళా వైభవాన్ని చాటిన నాలుగు శతాబ్దాల నాటి మడకశిర కొయ్య రథాన్ని పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. వారసత్వ కట్టడాల పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించే ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టరిటి కార్యక్రమంలో భాగంగా ఆయన అనంతపురం జిల్లా మడకశిర తేరువీధిలో నిర్లక్ష్యంగా పడిఉన్న అపురూప కొయ్య రథాన్ని పరిశీలించారు. విజయనగర పాలన చివరి రోజుల్లో మడకశిర కోట గుమ్మానికి ఎడమవైపు నిర్మించిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన ఈ రథం చారిత్రక ప్రాధాన్యతగలదని తెలిపారు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు మడకశిరలో జరిగే శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో దేవతా ఉత్సవ విగ్రహాలను ఈ రథంలో ఊరేగించేవారని, ఆరు దశాబ్దాల క్రితం వచ్చిన గాలివానకు అక్కడ ఉన్న పెద్ద మర్రిచెట్టు విరిగిపడి రథం శిఖరం కూలిపోయిందని, అది నిర్లక్ష్యానికి గురై అప్పటినుంచి అలాగే ఉందని చేగు రాధాకృష్ణగుప్తా, స్థానిక తేరువీధి నివాసి ఊరువాకిళ్ళ గోవిందరాజులు తెలిపారని శివనాగిరెడ్డి వివరించారు. విజయనగర కాలపు కొయ్య శిల్పుల అద్భుత కళాకౌశలం ఉట్టిపడే శిల్పాలతో రథాన్ని అలంకరించేవారని, రథం నాలుగు దిక్కులలో విష్ణుమూర్తి, దశావతారాలు, రామాయణ దృశ్యాలు, శృంగార భంగిమలు, రుషిపుంగవులు, జంతువుల శిల్పాలు వంటి వాటితో గత వైభవం ఉట్టిపడేలా కళాప్రాభవాలకు అద్దం పడుతూ చరిత్రను తెలిపే చారిత్రక రథాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీస్తుశకం 17వ శతాబ్దంలో మరాఠా పాలకుడు మురారిరావు వచ్చేంతవరకు మడకశిర ప్రాంతం విజయనగర ప్రభువుల ఏలుబడిలో ఉందని, వైష్ణవ మత ప్రచారంలో భాగంగా వారు శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయాన్ని నిర్మించి ఉత్సవాల కోసం కొయ్య రథాన్ని తయారు చేయించారని తెలిపారు. శిల్ప కళాఖండంగా కూడా ప్రాముఖ్యత చెందిన కొయ్య రథాన్ని ఎండ వానల నుంచి కాపాడి భవిష్యత్తరానికి అందజేయాలని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

శాశ్వత భూ హక్కుపై ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షాపథకం అమలులో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ రూపకల్పన, అభివృద్ధి, నిర్వహణ కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్‌తో రాష్ట్ర రెవెన్యూ శాఖ అవగాహన కుదుర్చుకోగా, గురువారం విజయవాడ వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం తరుపున సర్వే సెటిల్మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జరుగుమిల్లి రామకృష్ణారావు ఒప్పంద పత్రాలపై ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ సమక్షంలో సంతకాలు చేశారు. ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను రూపొందించటం ద్వారా రాష్ట్రంలో టైటిల్ సిస్టమ్ యొక్క నిశ్చయాత్మక నమోదు వంటివి సులభతరం అవుతాయని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ ఈ సందర్భంగా వివరించారు. పౌరులకు వివాదరహిత భూ యాజమాన్యాన్ని అందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ-హక్కు, భూ-రక్షా పథకం' ప్రారంభించిందన్నారు. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన ఏవైనా కొత్త సేవలను అందించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని వివరించారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూమి హద్దులను పునః పరిశీలించడం జరుగుతుందని సర్వే సెటిల్మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ సిద్ధార్థ్ జైన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో భూ యాజమాన్యంపై వివాదాలను తొలగించి నిశ్చయాత్మకమైన భూమి టైటిల్ సిస్టమ్‌ను అమలు చేయడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన అంశంగా ఉంటుందన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం ప్రయోజనాల దృష్ట్యా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్ సేవలు సద్వినియోగం కానున్నాయని, ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వెబ్‌ల్యాండ్ సిస్టమ్ కింద ఉన్న అన్ని సేవలను కవర్ చేస్తుందని సిద్ధార్థ జైన్ తెలిపారు.

మోదీ, అమిత్‌షా నియంతృత్వం: శైలజానాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మోదీ, అమిత్‌షా నియంతృత్వ పోకడలతో పోతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులతో రోజుల కొద్దీ విచారణలు చేస్తూ ప్రభుత్వ సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ కార్యాలయానికి సీల్ వేయడం అనైతిక చర్య అని, నోటీసులు ఇవ్వడం మరింత దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు నేషనల్ హెరాల్డ్ పత్రిక బకాయి ఉన్న రూ.90.25 కోట్లను వసూలు చేసుకునే హక్కును పొందేందుకు యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నేరపూరితమైన కుట్ర పన్నారని సుబ్రహ్మణ్యస్వామి చేసిన ఫిర్యాదుపై సోనియా, రాహుల్ సహా ఏడుగురిపై ఢిల్లీ కోర్టులో స్వామి కేసు దాఖలు చేశారు. కేవలం రూ.50 లక్షల చెల్లింపుతో ఆ హక్కును పొందేందుకు వారు యత్నించారని పిటిషన్‌లో పేర్కొనడం రాజకీయ కుట్రగా పేర్కొన్నారు. ప్రజలను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలపై అక్రమ కేసులతో బీజేపీ రాక్షసానందం పొందుతోందని ధ్వజమెత్తారు. మోదీ దురాగతాలకు తప్పకుండా మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

స్నేహం, సాంస్కృతిక సహకారం ఇస్కఫ్ లక్ష్యం

రాష్ట్ర అధ్యక్షుడు సుకుమారన్

శ్రీకాకుళం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్: ప్రజల మధ్య స్నేహం, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక జాతీయ సంస్థ ఇస్కఫ్ అని ఇస్కఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు టీఎస్ సుకుమారన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని దాసరి నాగభూషణం క్రాంతి భవన్‌లో గురువారం జరిగిన ఇస్కఫ్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్కఫ్ ఆవిర్భావ ప్రాముఖ్యతను సుకుమారన్ వివరించారు. దేశ సమైక్యత, సాంస్కృతిక, ఐక్యత, మతసామరస్యంలో భాగంగా వివిధ దేశాల, రాష్ట్రాల ప్రజల మధ్య స్నేహ, సాంస్కృతిక సహకారాలు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని చెప్పారు. రవీంద్రనాథ్ ఠాగూర్, సరోజినీ నాయుడు, వీఆర్ కృష్ణయ్య వంటి ఎంతో మంది ప్రముఖులు ఈ సంస్థకు నాయకత్వం వహించి సంస్థ పురోభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మతోన్మాదం, అసహనం, భావ వ్యక్తీకరణపై దాడులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, భారతీయ సంస్కృతిని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో ఇస్కఫ్ కార్యక్రమాలను మరిన్ని ప్రాంతాలకు విస్తరింపచేయడానికి మేధావులు, అభ్యుదయ వాదులు, ప్రగతిశీల కవులు, రచయితలు, కళాకారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు మాట్లాడుతూ మానవాళి మధ్య శాంతి సంబంధాలు, మానవతా సంబంధాలు, రక్తాన్ని కోరని సమాజం కోసమే ఇస్కఫ్ ఏర్పడిందన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ఇస్కఫ్ పని చేస్తున్నదని, అభ్యుదయ భావాలు కలిగిన ఏ పార్టీ వారైనా ఇస్కఫ్‌తో కలిసి పనిచేయవచ్చని అన్నారు. శ్రీకాకుళం సాంస్కృతిక, చారిత్రక కేంద్రమని, కళింగాంధ్ర, కళింగుల చరిత్రకు శ్రీకాకుళం హృదయం లాంటిదని ఆయన అభివర్ణించారు. ఇటువంటి శ్రీకాకుళంలో ఇస్కఫ్ సేవలను మరింత విస్తృత పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ఇస్కఫ్ అధ్వర్యంలో గొప్ప కార్యక్రమం జరిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన తెలియజేశారు. ఇస్కఫ్ పూర్వపు జిల్లా అధ్యక్షుడు సనపల నరసింహులు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇస్కఫ్ జిల్లా గౌరవ సలహాదారుగా నల్లి ధర్మారావు, గౌరవ అధ్యక్షుడిగా బుడుమూరు శ్రీరామ్మూర్తి, అధ్యక్షుడిగా ఎంవీ మల్లేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, కార్యదర్శిగా జీవీ నాగభూషణ్, ఉపాధ్యక్షుడిగా కరకవలస శ్రీనివాసరావు, సహాయకార్యదర్శిగా కె.భాస్కర్‌రావు, కన్వీనర్‌గా నాగరాజు పాత్రో, కమిటీ సభ్యులుగా చాపర వేణుగోపాల్, మధుసూదనరావు,పేడాడ ధనుంజయ రావు, గోవిందరాజులు, మధుబాబు, బలివాడ శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మత్స్యసంపద పెంపునకు ఏపీ టెక్నాలజీ

ఉత్తరప్రదేశ్ మంత్రి సంజయ్ కుమార్ నిషాద్

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఉత్తరప్రదేశ్‌లో మత్స్య సంపద పెంచేందుకు ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్న టెక్నాలజీని ఉపయోగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సంజయ్ కుమార్ నిషాద్ తెలిపారు. పాయకరావుపేట మండలం సముద్రతీరంలో గురువారం ఉత్తరప్రదేశ్ బృందం హేచరీలను సందర్శించింది. అనంతరం నిషాద్ మాట్లాడుతూ, ఆక్వాలో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉందని తెలిపారు. ఆక్వాకల్చర్ అభివృద్ధికి గల కారణాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. వాతావరణం, నీరు, నేల అనుకూల పరిస్థితులను పరిశీలించామన్నారు. ఈనెల 6న సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలవనున్నట్లు చెప్పారు. యూపీకి ఏపీ టెక్నాలజీ తీసుకెళ్తే అక్కడ ఆక్వా అభివృద్ధితో పాటు మత్స్యకారులు ఆర్థికంగా బలపడతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ నిషాద్, మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎన్.ఎస్.రహమాని, డాక్టర్ అమిత్ కుమార్ నిషాద్, జాతీయ మత్స్యకార సంఘం ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ అనంత నగేష్‌బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు మోసా అప్పలరాజు, మండల ఉపాధ్యక్షుడు వంకా దండియ్య పాల్గొన్నారు.

సంపాదకీయం

పొంచి ఉన్న ఆహార కొరత

రోజురోజుకీ అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూ జీవన వ్యయాన్ని అధికం చేస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం ఉన్న కుటుంబ జీవన వ్యయం ఆయా కుటుంబాల అవసరాల ననుసరించి నేడు కనీసం ఐదు నుంచి పదివేల రూపాయలు పెరిగింది. ఫలితంగా కోట్లాది మంది నిత్య జీవనం దుర్భరంగా మారిందే గాని మెరుగుపడలేదు. ఈ నేపథ్యంలోనే ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం లాంటి ప్రజలను పట్టి పీడిస్తున్న అంశాలపై చర్చించ డానికి కూడా మోదీ ప్రభుత్వం ఆసక్తి చూపడంలేదు. ఈ పరిస్థితికి తోడు దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉన్నది. అమృతోత్సవాలు జరుపుకుంటున్న పాలకులకు ఇలాంటి వన్నీ స్వల్ప విషయాలుగా అనిపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా జనాన్ని వణికించిన, కోటాది మంది ప్రాణాలు హరించిన కోవిడ్–19 మహమ్మారి, యుద్ధం, ఈ ఏడాది తగ్గిన వర్షాలు, పెరిగిన భూతాపం లాంటి అనేక కారణాల వల్ల వరి సాగు తగ్గుతుందని, ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతుం దని తాజాగా వెలువడిన గణాంకాల సారాంశం. ఉత్పత్తి తగ్గితే వస్తువుల ధరలు మార్కెట్‌లో మరింతగా పెరుగుతాయి. వర్షాల కొరత వల్ల వరి సాగు 13 శాతం తగ్గింది. కొరతను పరిగణ లోకి తీసుకొనే గోధుమ ఎగుమతిపై నిషేధం విధించారు. ఉత్పత్తి తగ్గినప్పుడు సేకరణ లక్ష్యం నెరవేరదు. ఉత్పత్తి ఖర్చుకు, రైతు పొందే ఆదాయానికి తీవ్రమైన తేడా ఉండటం వల్లనే అప్పుల పాలైన రైతులు వేలాది మంది ప్రతి ఏటా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దేశం మొత్తం మీద జరిగే వరి ధాన్యం ఉత్పత్తిలో పావు వంతు పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో జరుగుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లో వర్షాలు బాగా తగ్గాయి. ప్రపంచ వ్యాప్తంగా జరిగే బియ్యం వాణిజ్యంలో 40 శాతం భారతదేశం వాటా ఉంది. వీటి ఉత్పత్తి తగ్గితే ఎగుమతి తగ్గుతుంది. అప్పుడు విదేశీ మారక ద్రవ్యం నిల్వల మీద తీవ్ర ప్రభావం పడుతుంది. ధరలు పెరుగుతాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఆహార సంక్షోభం తలెత్తనున్నదని వ్యవసాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముంచుకొస్తున్న వాతావరణ సంక్లిష్టతలు ప్రజల అన్ని జీవన రంగాలను అతలాకుతలం చేస్తోంది. ఈ అంశాన్ని దీర్ఘకాలంగా పట్టించుకోక పోవడం వల్లనే ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, కొన్ని చోట్ల అధిక వర్షాలు, కోవిడ్ లాంటి అత్యంత ప్రమాదకర వ్యాధులు పెరుగుతున్నాయి. మన దేశంలో గోధుమ, వరి ధాన్యం ఉత్పత్తి తగ్గితే, అత్యధికంగా మనం చేస్తున్న ఎగుమతులు తగ్గి అంతర్జాతీయంగా ఆహార ధాన్యాల కొరతకు దారి తీస్తుంది. ఈ ఏడాది మే 13 నుంచి గోధుమ ఎగుమతులపై నిషేధం విధించిన తర్వాత మే 14 నుంచి సేకరణ కోటి 80 లక్షల టన్నులు జరిగింది. గత ఏడాది ఇదే కాలంలో సేకరణ మూడు కోట్ల 60 లక్షల టన్నులకు పైగా సేకరించగలిగారు. సేకరణ 53 శాతం అంటే 182 లక్షల టన్నులు తగ్గింది. మే నెల నాటికి గోధుమ సేకరణ సైతం 4.41 శాతం తగ్గింది. బియ్యం వినియోగం పెరుగుతున్న సమయంలోనే ఉత్పత్తి తగ్గడం ఆందోళన కలిగించే విషయం. కొన్ని రకాల బియ్యం ధరలు ఇప్పటికే పది శాతం పెరిగాయి. ఆగస్టు, సెప్టెంబరులో సాధారణ వర్షపాతం ఉన్నట్లయితే గోధుమ, వరి ఉత్పత్తులు పెరగవచ్చు. అయితే ఏ మేరకు పెరుగుతాయనేది ఇప్పుడే అంచనా వేయలేం. ఈ పరిస్థితుల కారణంగా ద్రవ్యోల్బణం 7 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని 6 శాతానికి తగ్గించాలన్నది తమ లక్ష్యమని ప్రభుత్వం చెప్తోంది. అయితే తగ్గించడానికి తీసుకోబోయే చర్యలను వెల్లడించరు. ఎందుకంటే ధరలు, ద్రవ్యోల్బణం తగ్గించాలన్న ఆలోచన ఈ ప్రభుత్వం వద్ద కనిపించదు. స్వాతంత్ర్య పోరాట చరిత్రే లేని పాలకులు తిరంగ కార్యక్రమం చేపట్టటం, అమృతోత్సవాల నిర్వహణ, పాలక బిజెపి విస్తరణ, మరిన్ని రాష్ట్రాల్లో తమకు మెజారిటీ ఉన్నా లేకపోయినా అక్రమ మార్గాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంలో తల మునకలై ఉన్నారు.

నేడు సామాన్యుల దుస్థితిని తెలియజేసే ఆసక్తికరమైన సంఘటన రాజ్యసభలో చోటు చేసుకున్నది. దిల్లీలో నివసించే నలుగురు సభ్యులు గల కుటుంబ యజమాని నెలకు రూ.12 వేలు సంపాదిస్తున్నాడు. ఇంటి అద్దె రూ.4 వేలు, పిల్లల స్కూలు ఫీజు రూ.2 వేలు, రూ.1200 వంట గ్యాస్, వైద్యం ఖర్చులు కొన్ని వేలు, ఆహారానికి రూ.3 నుంచి రూ.4వేలు అవుతుంది. అంటే నెలసరి వచ్చే ఆదాయం కుటుంబ జీవనానికి సరిపోతుందా? ఇంతకంటే తక్కువ ఆదాయంతో జీవించే వాళ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దేశ ప్రజలు ఏమాత్రం సంతృప్తికర జీవనం సాగించలేనప్పుడు తమకు కావలసిన రీతిలో వృద్ధి గణంకాలను వెల్లడించినా ఉపయోగం ఉండదు. పాలకుల ఉత్సవాలను నిత్య జీవనానికి సతమతమయ్యే జనం పట్టించుకోరు. వంది మాగద మీడియా ప్రభుత్వం గొప్పలు చెబితే ప్రజలు నమ్మరు. ఒకవైపు గతంలో ఏనాడు లేనంతగా నిరు ద్యోగం తాండవిస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోయి సరైన ఆదాయం లేక సతమతమవుతున్న వారికి కనీసం ఆహార భద్రత కల్పించడానికి ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం చర్యలను తీసుకోవాలి. ప్రజలు స్వయం సమృద్ధి పొందాలి. దేశం స్వయం సమృద్ధి పొందుతుందని, మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ అంటూ ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, కొత్త కొత్త ఆకర్షణీయమైన నినాదా లిచ్చినా ప్రయోజనం ఉండదు. పౌష్టికాహార లోపంతో ఈసురో మంటూ జీవిస్తున్న మహిళలు, పిల్లలు మరిన్ని బాధలకు గురవక తప్పదు.

జెండా పండుగ

రా బావా! ఏంటి ఈ రోజు కొంచెం ఆలస్యమైంది. ఏం లేదు బావా నేను బయలుదేరి వస్తుంటే దారిలో బి.జె.పి వారు మీటింగు జరుగుతుంటే కొంతసేపు అక్కడ నిలబడ్డా. ఏం అంటున్నారు బావా. ఆ ఏముంది బావా అందరు యిచ్చే స్లోగనే కుల మత వర్గ రహిత సమాజం స్థాపిస్తారట. ఆ పార్టీకి తప్ప యితరుల వల్ల కాదట. అందులో తప్పేముంది బావా. 75 ఏళ్లలో ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ అలాగే అన్నది కాని ఏం చేయలేక పోయింది గద. అందుకే అలా మాట్లాడుతున్నారు బావా. పైగా కమ్యూనిస్టులు ఔటాఫ్ డేట్ అని వెంకయ్య నాయుడు ఎప్పుడో అన్నారు. కాబట్టి యిక మిగిలింది బి.జె.పి గదా అలా అనక ఎలా అంటారు.

అది సరే బావా ఒకపక్క మనుస్మృతిని రాజ్యాంగంగా తేవాలనే వారు కల మత వర్గ రహిత సమాజం అంటే మెదడున్న వాడెవడు నమ్మడు గద బావా. అది సరే బావా ఈ మధ్య ప్రధాని మోదీ పక్కన కూర్చుని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి ఒక మాటన్నారు. అది విశేషమే గద బావా. అదా రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన జరుగుతోందని ప్రజల కోసం అంబేద్కరు రాసిన రాజ్యాంగాన్ని చెత్తబుట్టలో పడేసి యిష్టమొచ్చినట్లు పాలన చేస్తున్నారని. అదే బావా నిజంగా కత్తితో పొడిచిన దానికంటే బాధించేది మాటే కదా. అవును బావా నేటి పాలకులకు అవేమీ చెవికెక్కవు. వారికి



కావల్సింది అధికారం, సంపాదన అంతేగాని యివన్నీ వారికి పట్టవు బావా. అది సరే బావా స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా యిప్పటికి కోర్టుల ద్వారా ప్రజలకు న్యాయం జరగడం లేదని కోర్టుకు రాలేక ఎంతోమంది మౌనంగా భరిస్తున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నారంటే పాలనలో లోపాల్ని ఎత్తి చూపడమే గదా బావా.

అవును బావా అవి చెవికెక్కించుకోకుండా పైగా సులువుగా ప్రజలకు న్యాయం అందించాలని మోదీ న్యాయమూర్తికి సూచన చేశారంటే అసలు మోదీకి మనసుందా అనిపిస్తోంది బావా. అది సరే బావా 75 ఏళ్ల తరవాత ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచన వచ్చిందంటే అసలు ఈ పాలకుల్ని ఏమనాలో అర్థం కావడం లేదు. అసలు ఎన్నుకున్న ప్రజలకు న్యాయం చేయడానికి ఎన్ని వందల సంవత్సరాలు కావాలో ఈ నేతలకు. అది నిజమే బావా ఎవరి మటుకు వారికి అధికారం కోసం తపన. ఆ తరవాత సంపాదన కోసం తప్ప ఎన్నికలలో యిచ్చిన వాగ్దానాలు పదవి వచ్చిన మరునాడే వది లేస్తున్నారు బావా. నిజమే బావా ఎక్కువ మందికి జిల్లా స్థాయిలోనే న్యాయం అందాలని అందరూ సుప్రీంవరకూ రాలేక తమలో తామే మగ్గిపోతున్నారని జిల్లా కోర్టుల ప్రక్షాళన ద్వారా జిల్లా స్థాయిలో న్యాయం అందించే విధంగా ఆలోచించాలని కూడా యన్.వి.రమణ అన్నారు. అదిసరే ఆయనకు ముందు ఆ పదవిలో ఉన్నవారికి ఈ రకమైన ఆలోచనలు ఎందుకు రాలేదో? 75 ఏళ్ళతర్వాత ఆ ఆలోచన వచ్చినా ఎప్పటికి అమలుకు నోచుకుంటుందో మరి.

అంతే! అన్నంత మాత్రాన అమలు జరిగితే మనదేశం ఎప్పుడో బాగు పడేది. అది సరే యింకో మాట కూడా పెద్దలు సెలవిచ్చారు. ఏంటి బావా అది. ఏముంది పౌష్టికాహారం లేక పిల్లలు ఎదుగుదలలో లోపం జరుగుతుందని. అంటే పిల్లల అకాల మరణాలు కూడ 75 ఏళ్లకు గుర్తొచ్చిందంటే అసలు పాలకులేనా అనిపిస్తోంది బావా. నాకు ఇంకో ధర్మ సందేహం ఉంది. అదేమిటంటే కోర్టుల్లో కూడ న్యాయం జరగటం లేదని ఒకే విషయంలో న్యాయమూర్తుల తీర్పు విరుద్ధంగా ఉంటోంది అదెలా బావా. ఏముంది బావా ఈ విషయంలో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులే యిటువంటి సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అంటే న్యాయమూర్తుల తీర్పుల్లో కూడా రాజకీయ జోక్యం ఉందనేగా బావా. ఏమిటి ఎందుకు అని మనం చెప్పలేంగాని న్యాయమూర్తుల తీర్పుల్లో వ్యత్యాసం గమనించవలసిన విషయమే బావా.

అది సరే బావా పింగళి వెంకయ్య ఇపుడు గుర్తుకొచ్చాడేంటి. ఏముంది బావా 75 ఏళ్ల పండుగ సందర్భంగా జెండా ఎగరేయాలి. జెండా రూపకర్త గదా. గత సంవత్సరమే జగన్ వెళ్లి పరామర్శ చేసి కొంత నగదు యిచ్చి కుటుంబాన్ని పరామర్శించాడు. అయినా బావ సమస్యలు పరిష్కరించకుండా జెండా పండుగని జెండా ప్రతి యింటిపై ఎగరవేయాలి అంటే ఉత్సాహంతో చేయలేరు గదా. నిజమే బావా అదంతా అనవసరం. రాజుగారి ఆజ్ఞ ప్రజలు పాటించాలి అంతే. నిజమే బావా 75 ఏళ్లు తరవాత కూడ ఆకలితో అలమటిస్తూ జెండా పండుగ జెండా ఎగురవేయమంటే భయపడి బలవంతాన ఎగర వేయడమే కాని సంతోషం ఎక్కడి నుంచి వస్తుంది బావా. అది నిజమే బావా యిన్నేళ్లు అసలు పింగళి వెంకయ్య పేరు తలవకుండా యిప్పుడు కేంద్రం దూతగా కిషన్‌రెడ్డి వచ్చి పింగళి కుటుంబాన్ని దిల్లీకి ఆహ్వానించారు. ఇప్పటివరకు ఆ కుటుంబం ఎలా జీవిస్తుందోనని ఆరా తీసినవారు లేరు. కుటుంబీకులలో ఒకరికి ఉద్యోగం కోసం 10 ఏళ్ల కిందట ప్రయత్నించినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు బావా. ఇపుడేమో దిల్లీ రండి పింగళికి భారతరత్న యిచ్చే ఆలోచన ఉంది అంటే వారి కడుపు నిండిపోతుందా బావా.

వ్యాస రచయిత సెల్: 9885569394

మ్యానిఫెస్టోలో లేనప్పుడు మద్య నిషేధ కమిటీ ఎందుకు?

డా. అఖిల మిత్ర

"మద్యనిషేధం మా మ్యానిఫెస్టోలో లేదు, ఉన్నదని ఎవరైనా నిరూపిస్తే ఎలాంటి చర్చకైనా రెడీ" అన్నారు రాష్ట్ర మంత్రి గుడివాడ అమరనాథ్. మద్య నిషేధం మ్యానిఫెస్టోలో లేనప్పుడు దానికి ఒక కమిటీ చైర్మన్, సిబ్బందికి ప్రతి నెల లక్షలు ఎందుకు ఖర్చు చేయడం దండగ? కరోనా మొదటి దశలో తాగుబోతులను లైన్‌లో పెట్టడానికి ప్రభుత్వ టీచర్ల సేవలు వినియోగించుకున్నారు. మద్య నిషేధంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం మద్యం అమ్మకాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకుంటున్నది. ప్రభుత్వం మద్యం ధరలను అమాంతం పెంచేయడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ మద్యం ఏరులై పారింది. దీనిని కట్టడి చేయటానికి నానాతంటాలు పడిన ప్రభుత్వం చివరికి ధరలను కొంతమేర తగ్గించక తప్పలేదు. పై పెచ్చు అనేక రకాల కొత్త రకం బ్రాండ్లను మార్కెట్‌లోకి విడుదల చేసి అప్పటి వరకు ఉన్న బ్రాండ్లలో దాదాపు 90% బ్రాండ్లు ఎత్తేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో మద్యపాన నిషేధం దిశగా అడుగులు పడినట్లు కనిపించినా తర్వాతి కాలంలో మాత్రం ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యం అనే చెప్పాలి. వీరు పంపిణీ చేస్తున్న మద్యం తయారీకి పది రూపాయలు అయితే ప్రభుత్వం రెండు వందలకు అమ్ముతున్నది. నాసిరకం సరుకు, స్పిరిట్, హానికర పదార్థాలతో వస్తున్న ఈ మద్యం తాగితే తొందరగా పోవడం ఖాయం. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్రంలో 4,380 వైన్ షాపులు ఉండగా వాటిని 3,500కు తగ్గించడంతో పాటు వీటిని ప్రభుత్వమే నడిపేలా చర్యలు తీసుకున్నారు. ఏటా 20 శాతం వైన్ షాపులను తగ్గిస్తూ ఐదేళ్ళ కాలంలో పూర్తిగా వైన్ షాపులు ఎత్తేస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. మద్యం తాగాలంటే ప్రజలు భయపడే పరిస్థితులు కల్పిస్తామని, పెద్ద పెద్ద మాల్స్, 5 నక్షత్రాల హోటల్స్‌లో మాత్రమే మద్యం అందుబాటులో ఉండేలా చేస్తామని, అక్కడ కూడా ధరలు భారీగా ఉండేలా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అధికారంలోకి రాగానే మూడు దశల్లో పూర్తి మద్యపాన నిషేధం చేస్తానని తన పాదయాత్ర సమయంలోనే సంచలన ప్రకటన చేశారు జగన్. తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతామని, రెండో దశలో మద్యపానం వలన కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేసే విధంగా ప్రభుత్వం తరపున ప్రచారం నిర్వహిస్తామని, చివరి దశలో మద్యం రేట్లను విపరీతంగా పెంచుతామని, పేదల జీవితాల్లోకి మద్యం రాకుండా చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి అతిపెద్ద ఆదాయ వనరైనప్పటికీ రిస్క్ తీసుకుని మద్యం రేట్లను పెంచుతామని చెబుతూ, మద్యం తయారు చేసినా,

అమ్మినా ఏడేళ్ల శిక్ష విధించేలా చట్ట సవరణ చేస్తామని అప్పట్లో స్పష్టం చేశారు. మూడు దశల్లో మద్యాన్ని నిషేధించేందుకు రిహాబిలిటేషన్ సెంటర్లు సహా అవసరమైన అన్ని చర్యలు చేపట్టడమే కాకుండా అందుకు కొత్త చట్టంతో పాటు ప్రత్యేక యంత్రాంగాన్ని సైతం ఏర్పాటు చేస్తామని కూడా చెప్పారు. మూడు దశల్లో మద్యపాన నిషేధ ప్రక్రియ కొనసాగిస్తూ 2024 నాటికి పూర్తిగా నిషేధం విధిస్తామని, సంపూర్ణ మద్య నిషేధం అమలు చేసిన తర్వాతే 2024లో ఓట్లు అడిగేందుకు మళ్ళీ మీ వద్దకు వస్తానని జగన్ పలుమార్లు హామీలు గుప్పించారు. మద్యపాన నిషేధ హామీని నవరత్నాల్లో కూడా చేర్చారు. ఇవన్నీ అటకెక్కినట్టే కనిపిస్తున్నాయి. జగన్ సర్కార్ వచ్చి మూడేళ్ళు దాటిన నేపథ్యంలో మద్యపాన నిషేధం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. మద్యపాన నిషేధం ఎప్పుడు? అని నిలదీసి అడుగుతున్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత రాష్ట్రంలో 1446 మద్యం షాపులు, 43 వేల బెల్టు షాపులు తొలగించారు. షాపుల పనివేళలు కుదించారు. షాపుల్లో తాగడానికి అవకాశం ఉన్న పర్మిట్ రూమ్‌లు రద్దు చేశారు. కానీ, మద్యం అమ్మకాలు మాత్రం తగ్గలేదు. పైగా గతం కంటే ఆదాయం పెరిగింది. మద్యం పైన షాక్ కొట్టేలా ధరలు పెంచామని ప్రభుత్వం ఓపెన్‌గా చెబుతోంది. మద్యం పైన ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతోంది. 2019-20లో ఎక్సైజ్ పన్ను రూపంలో ప్రభుత్వానికి రూ. 6,914 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ తరవాత ఇబ్బడిముబ్బడిగా పెంచిన రేట్లతో రూ.7,931 కోట్ల ఆదాయం అంచనా వెయ్యగా, ఏకంగా రూ.11,535 కోట్ల ఆదాయం వచ్చింది. ఎక్సైజ్ పన్నుతో పాటు మద్యం మీద వచ్చే వ్యాట్ ఆదాయం కూడా కలిపితే మద్యం వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం దాదాపుగా రూ. 18,000 కోట్లు. ఇక కరోనా కారణంగా ఆర్థిక మందగమనం, అలాగే ఆర్థిక క్రమశిక్షణ లోపించడం కారణంగా అప్పులు దొరికే పరిస్థితి లేకపోవడంతో ఈ ఆదాయం మీదే ప్రభుత్వం ఆశలన్నీ పెట్టుకుంది. దీన్నిబట్టి చూస్తే అధిక రాబడి కోసం ప్రభుత్వం త్వరలో మరోసారి మద్యం రేట్లు ఇతోధికంగా పెంచుతుందని అర్థమవుతోంది. బేవరేజెస్ కార్పొరేషన్ బార్లకు సరఫరా చేసే మద్యంపై అదనపు రిటైల్ టాక్స్ వసూలు చేస్తుండటంతో ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తోంది. షాపులు తగ్గించి, రేట్లు పెంచినా మద్యపాన నిషేధం దిశగా ఆశించిన ఫలితాలు కనిపించలేదని ఎక్సైజ్ విభాగం అధికారులు అభిప్రాయపడుతున్నారు. అంటే మద్యపాన నిషేధం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్ములా పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదు. షాపులు తగ్గించి ధరలు పెంచినా అమ్మకాలకు, తాగేవారికి ఢోకా లేకుండా పోయింది. మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపేస్తే తప్ప ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. ఇప్పటికే ఆర్థికంగా దివాళా తీసిన ప్రభుత్వం మద్యం, పెట్రోలు, డీసెల్ అమ్మకాలపై కొంత నష్టనివారణ చేసుకుంటున్నది. మద్యం అమ్మకాలలో భారీగా క్షీణత ఉన్నదని అప్పుడప్పుడు పేపర్ ప్రకటనలు ఇస్తూ వాస్తవాన్ని దాచి పెడుతున్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు పెడుతున్నారుగానీ మద్య నిషేధాన్ని మాత్రం గాలికొదిలేశారు.

> జగన్ సర్కార్ వచ్చి మూడేళ్ళు దాటిన నేపథ్యంలో మద్య పాన నిషేధం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. మద్యపాన నిషేధం ఎప్పుడు? అని నిలదీసి అడుగుతున్నారు. జగన్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరవాత రాష్ట్రంలో 1446 మద్యం షాపులు, 43 వేల బెల్టు షాపులు తొలగించారు. షాపుల పనివేళలు కుదించారు. షాపుల్లో తాగడానికి అవకాశం ఉన్న పర్మిట్ రూమ్‌లు రద్దు చేశారు. కానీ, మద్యం అమ్మకాలు మాత్రం తగ్గలేదు. పైగా గతం కంటే ఆదాయం పెరిగింది.

భయపెడుతున్న మంకీపాక్స్

రెండేళ్ళు ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా భయాందోళనలు తొలుగుతున్న వేళ మంకీపాక్స్ ఆర్థోపాక్స్ వైరస్ ప్రపంచ మానవాళికి మరో సవాల్ విసురుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 83 దేశాల్లో ఆగష్టు 2 నాటికే 25,391 మంకీపాక్స్ కేసులు నమోదైనాయని, అంతర్జా తీయంగా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా పరిణమించిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రక టించడం ఓ ప్రమాద హెచ్చరికగా దేశాలన్నీ భావించాల్సిన సమయం ఆసన్నమైంది. యూయస్‌లో 6,325, కెనడాలో 803, యూకేలో 2,759, జర్మనీలో 2,724, బ్రెజిల్, బెల్జి యంలో 482, స్పెయిన్‌లో 4,577, ఫ్రాన్స్‌లో 2,054, ఇటలీలో 505, నెదర్లాండ్‌లో 927, పోర్చుగల్‌లో 633 మంకీపాక్స్ కేసులు నమోదు కావడం వైరస్ వ్యాప్తి తీవ్రతను తెలుపుతున్నది. 1958లోనే ఆఫ్రికన్ దేశాల్లో మంకీపాక్స్‌ను గుర్తించారు కానీ ఇప్పటివరకు భయపడాల్సిన పరిస్థితులేమీ ఏర్పడలేదు. నేడు ఈ వైరస్ కేసులు వేగంగా పెరుగు తున్నాయి. ప్రపంచ దేశాలను చుడుతున్న మంకీపాక్స్ మనదేశంలో కేరళ, దిల్లీ, కర్నాటక లాంటి రాష్ట్రాలకూ వచ్చింది. ఈ రాష్ట్రాల్లో ఇతర దేశాల నుంచి వచ్చిన ఎనిమిది మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. అనుమానిత మరణాలూ నమోదు కావడంతో సామాన్య ప్రజలు భయకంపితులవుతున్నారు. మశూచి లేదా స్మాల్‌పాక్స్ లాంటి వ్యాధి లక్షణాలు కలిగిన మంకీపాక్స్ ప్రమాదకరమైనదే అయినప్పటికీ ప్రాణ భయం 3-6 శాతం మాత్రమే ఉంటుందని నిపుణులు వివరించడంతో కొంత ఊరటను ఇస్తున్నది.

మంకీపాక్స్ సోకిన రోగుల్లో ప్రారంభంలో ఫ్లూ-లాంటి లక్షణాలతో పాటు చలిజ్వరం, నీరసం, దద్దుర్లు, తలనొప్పి, వికారం, చర్మం దురద లాంటి లక్షణాలు కనిపించినా వారం రోజుల తరవాత ముఖం, చేతులు, కాళ్ల నొప్పులతో కూడిన బొబ్బలు బయటపడతాయి. వివిధ దేశాల్లో వైరస్ ప్రభావాలను పూర్తిగా విశ్లేషించాల్సి ఉందని వైద్యులు అంగీకరిస్తున్నప్పటికీ వ్యాధి సోకిన రోగులు దగ్గినపుడు, తుమ్మినపుడు సూక్ష్మ బిందువులు లేదా తుంపర్లు, లాలాజలం రూపంలో ఇరుగుపొరుగు వారికి చేరి మంకీపాక్స్ వైరస్ సంక్రమిస్తుంది. రోగుల దుస్తులు ముట్టడం, రోగులను నేరుగా తాకడం, రోగుల శరీర ద్రవాలు అంటుకోవడం, లైంగిక కలయిక సందర్భాల్లో మంకీపాక్స్ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సులభంగా సోకుతుంది. కరోనా కన్నా మంకీపాక్స్ వైరస్ వ్యాప్తి రేటు చాలా తక్కువగానే కనిపిస్తున్నప్పటికీ కరోనా కాలంలో పాటించిన భౌతిక దూరాలు, వ్యక్తిగత శుభ్రత, గాలి ప్రవహించే గదులు, ఐసొలేషన్ లాంటి నియమనిబంధనలు విధిగా పాటిస్తే మంకీపాక్స్‌నూ కట్టడి చేయవచ్చునంటున్నారు. మశూచి వ్యాధికి వాడుతున్న యాంటీవైరల్ టీకా థెరపీని మంకీపాక్స్‌కూ వాడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

1979లో మశూచి వ్యాధిని నిర్మూలించగలిగిన భారత్ నేడు నిర్లక్ష్యం చేస్తే అదే రకమైన వైరస్ బారిన పడవచ్చని హెచ్చరికలు ఉన్నాయి. ప్రస్తుతం కొద్దిపాటి కేసులు మాత్రమే నమోదైన ఇండియాలో వెంటనే టీకాలను వాడే అవకాశం లేదు. అంతర్జాతీయ యాత్రికుల నుంచి వ్యాపిస్తున్న మంకీపాక్స్ వ్యాప్తిని కట్టడి చేయడానికి విమానాశ్రయాల్లోనే పకడ్బందీగా స్క్రీనింగ్ చేయడం, అనుమానితులను ఐసొలేట్ చేయడం లాంటి చర్యలు తీసుకోవడం తక్షణమే ప్రారంభించాలి. వైద్య ఆరోగ్య యంత్రాంగాన్ని తక్షణమే సమాయత్తం చేయాలి. మంకీపాక్స్‌ను అదుపు చేయుటకు మశూచి వ్యాక్సీన్‌లు కూడా సత్వరమే అందుబాటులోకి తేవాల్సి ఉంది. రోగులను గుర్తించడం, చికిత్సలు అందుబాటు లోకి తేవడం, రోగులను విడిగా ఉంచడం, టీకాలను అందుబాటులోకి తేవడం లాంటి ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజలు కరోనా నిబంధనలను విధిగా పాటించాల్సి ఉంది.

ఉద్యోగ ఉపాధుల కల్పనలో ప్రభుత్వాల అలసత్వం

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి

నేడు దేశ జనాభాలో 34 శాతం యువతే (15-29 ఏండ్ల వయస్సు వారు). ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశంగా ఇండియాకు 'యువ భారత్' అనే పేరున్నది. 2030 నాటికి భారత్‌లో 36.5 కోట్ల యువత ఉంటారని అంచనా. పనిచేయగల సత్తా ఉన్న ఈ యువతకు తగిన స్థాయిలో ఉద్యోగ ఉపాధులు లేవు. ఎటు చూసినా నిరుద్యోగం తాండవిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. పదవీ విరమణలు ప్రతి నెల పెరుగుతున్నాయి. ఖాళీలు ఏర్పడిన వెంటనే భర్తీ ప్రక్రియ చేపట్టాల్సిన ప్రభుత్వాలు ఏళ్ల తరబడి మౌనంగా ఉంటూ యువత భవితతో ఆటలు ఆడుతున్నాయి. యువ భారతంగా పేరొందిన దేశంలో అర్హులకు తగిన ఉద్యోగాలు కరువైనాయి. ఉద్యోగ ఖాళీలతో ప్రభుత్వ యంత్రాంగ ప్రజాసేవలు నత్తనడకన కదులుతున్నాయి. ఉద్యోగాల భర్తీ వల్ల ఆర్థిక భారం పడుతుందనే అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వాలు భర్తీలకు సుముఖంగా లేవు.

లక్షల్లో ఖాళీలు

దేశవ్యాప్తంగా జాతీయ బ్యాంకులు, రక్షణ శాఖ, వైద్యఆరోగ్య శాఖ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, న్యాయ శాఖ లాంటి విభాగాల్లో ఖాళీలను కూడా లెక్కిస్తే నేడు 30 లక్షల ఉద్యోగాల వరకు ఖాళీగా ఉన్నాయని తెలుస్తున్నది. దేశంలోని ఒక్కొక్క రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ ఖాళీలు లక్షల్లో ఉంటాయనేది వాస్తవం. ప్రభుత్వంలో పెరిగిన ఉద్యోగ ఖాళీలతో ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఆలస్యం కావడం, అవినీతి చీడపీడలు పెరగడం సర్వసాధారణమైంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ఉద్యోగ ప్రకటనలతో యువతను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉద్యోగ భర్తీ ప్రక్రియలను వేగిర పరచాలని యువత కోరుకుంటున్నది.

తెలుగు రాష్ట్రాల్లో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వివిధ విభాగాల్లో ఉన్న 91,142 ఖాళీలను గుర్తించామని, వీటిలో 80,039 ఉద్యోగాలకు భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రకటించారు. అన్ని అడ్డంకులు అధిగమించి సత్వరమే భర్తీ ప్రక్రియలను పూర్తి చేయాలని యువత కోరుతున్నారు. వీటిలో 11,103 ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో 66,309 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని త్వరలో భర్తీ చేయడానికి ప్రక్రియ ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం తెలియజేసింది. ఏపీలో మొత్తం 7,71,177 ఉద్యోగాలు ఉండగా వీటిలో 5,29,868 మంది పని చేస్తున్నారని, 1,75,000 ఒప్పంద లేదా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని తెలుస్తున్నది. శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు కలిపి 7,04,868 మంది ఉన్నట్లు ఏపీ ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది.

> ఉద్యోగ కల్పనలో ప్రైవేట్ రంగం కూడా నిరుత్సాహపరుస్తున్నది. సాధారణంగా ప్రైవేట్ సంస్థలు తక్కువ ఉద్యోగులతో ఎక్కువ పని చేయించుకొని, తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తుంటాయి. అయినా ఈ రంగంలోనూ ఉద్యోగ ఉపాధులు ఆశించిన మేర లేవు. కరోనా కాలంలో ఈ సమస్య మరింత పెరిగింది. గ్రామాల్లోనే కాదు, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. పుండు మీద కారం చల్లినట్లు ఉక్రెయిన్ రష్యా యుద్ధం ధరల పెరుగుదలకు మరో ప్రధాన కారణం కావడంతో ఆర్థిక చిక్కులు, నిరుద్యోగం, ఆకలి చావులు పెరుగుతూనే ఉన్నాయి.

అవుట్ సోర్సింగ్

ఏటా ఒప్పంద ఉద్యోగులసంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2017లో 11.11 లక్షలు, 2020లో 13.25 లక్షలు, 2021లో 24.31 లక్షల ఒప్పంద ఉద్యోగాలు కల్పించినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. తక్కువ వేతనంతో, అపరిశుభ్ర వాతావరణంలో పని చేస్తున్న ఒప్పంద, అవుట్ సోర్సింగ్, గౌరవ వేతన ఉద్యోగులు దిక్కులేని దుస్థితిలో సేవలు అందిస్తున్నారు. ఏళ్ల తరబడి భర్తీలు చేపట్టని కారణంగా యువత కనీస భర్తీ వయస్సు దాటి పీజీ, పిహెచ్‌డి అర్హత కలిగిన ఉండి కూడా నిరాశతో దినసరి కూలీ పనులకు సహితం వెళ్లడానికి వెనుకాడడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యువత నిరుద్యోగ రేటు 20 శాతంగా ఉందని తేలింది. ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం ఇండియాలో ఏటా 50-70 లక్షల మంది అదనంగా చేరుతున్నారు. బ్యాక్‌లాగ్ నిరుద్యోగులు 3 కోట్లు ఉన్నట్లు అంచనా. మరి రాబోయే 18 మాసాల్లో కేవలం 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సహేతుకమేనా? ఇదే దుస్థితి అన్ని కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల్లో కూడా నెలకొంది. ఉద్యోగ కల్పనతో యువత దేశాభివృద్ధికి, శాంతియుత సమాజ ప్రగతికి దోహదపడతారని మరువరాదు.

నిరుత్సాహపరుస్తున్న ప్రైవేట్ రంగం

ఉద్యోగ కల్పనలో ప్రైవేట్ రంగం కూడా నిరుత్సాహపరుస్తున్నది. సాధారణంగా ప్రైవేట్ సంస్థలు తక్కువ ఉద్యోగులతో ఎక్కువ పని చేయించుకొని, తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తుంటాయి. అయినా ఈ రంగంలోనూ ఉద్యోగ ఉపాధులు ఆశించిన మేర లేవు. కరోనా కాలంలో ఈ సమస్య మరింత పెరిగింది. గ్రామాల్లోనే కాదు, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. పుండు మీద కారం చల్లినట్లు ఉక్రెయిన్ రష్యా యుద్ధం ధరల పెరుగుదలకు మరో ప్రధాన కారణం కావడంతో ఆర్థిక చిక్కులు, నిరుద్యోగం, ఆకలి చావులు పెరుగుతూనే ఉన్నాయి. కరోనా, యుద్ధం పేరుతో ప్రైవేట్ రంగం ఉద్యోగులను తొలగించింది, వేతనాల్లో కోత విధించింది. యువశక్తి నిర్వీర్యం కాకుండా సకాలంలో ప్రభుత్వాలు, సమాజం జాగ్రత్త పడాలి. నిరుద్యోగ యువతలో నిరాశ పెరిగితే సమాజంలో శాంతి హరించుకుపోతుందని, తీవ్రవాదం పెరిగే ప్రమాదం ఉంటుందని మరువరాదు.

ప్రభుత్వాల కనీస బాధ్యత

ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూనే కొత్త ఉద్యోగ ఉపాధుల కల్పనకు పథక రచనలు చేయాలి. ఉద్యోగ ఉపాధుల లేమితో వైద్య ఆరోగ్య, పోషకాహార, విద్య, అక్షరాస్యత, నైపుణ్యాలు, మహిళలు/బాలల భద్రత, తాగు నీరు, పారిశుద్ధ్యం లాంటి అనేక అంశాల్లో సమస్యలు ఉత్పన్నం అవుతాయి. కనీస అవసర వ్యవస్థలను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు, మానవ వనరుల అభివృద్ధి, కనీస మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలి. దీంతోపాటు పారిశ్రామికీకరణ విధానాలను పునఃసమీక్షిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (యంయస్‌యంఈలు) ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ, ఉత్పత్తి పెంచుతూ, ఆర్థిక చేయూతను ఇస్తూ ఉద్యోగ ఉపాధులు కల్పించాలి. మనకు మాత్రమే వరం కాగల యువశక్తిని దేశాభివృద్ధికి వినియోగిస్తూ, మానవ వనరులను నైపుణ్య నిధులుగా మార్చుతూ, ఉద్యోగ ఉపాధులతో పాటు ఔత్సాహిక వ్యాపార వేత్తలుగా యువతను తయారు చేసే మహాయజ్ఞంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు ప్రముఖ పాత్ర పోషించాలి. యువతే దేశ భవిత అంటూ ముందుకు సాగాలి.

వ్యాస రచయిత సెల్ 9949700037

దళితుల చేతివంట తినం

- మధ్యాహ్న భోజనం చేయని ఓబీసీ విద్యార్థులు
- గుజరాత్ స్కూలు పిల్లల్లో కులభావన

న్యూఢిల్లీ: దేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోనున్న తరుణంలోనూ అగ్రవర్ణాల వారు తమ కులభావనను పోనిచ్చుకోవడం లేదు. అంటరానితనాన్ని పారద్రోలామని పెద్దలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. తాజాగా గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో శ్రీశోక్డా ప్రాథమిక పాఠశాలలో ఇలాంటి సంఘటనే వెలుగుచూసింది. స్కూల్లో మొత్తం 153 మంది పిల్లలు ఉంటే వీరిలో 147 మంది ఓబీసీ విద్యార్థులున్నారు. దళిత మహిళ వంట చేస్తున్నదన్న కారణంగా మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలో పెట్టే భోజనాన్ని ముట్టమని ఆ పిల్లలు భీష్మించారు. ఇందుకు తల్లిదండ్రుల సమర్థన ఉంది. స్కూలు అధికారులు, తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ సమావేశమై ఈ సమస్య పరిష్కారానికి విఫలయత్నం చేశారు. ధరా మక్వానా అనే దళిత మహిళ ఈ స్కూలులో వంట మనిషి. ఆమె చేతి వంట ఎందుకు తినరని పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఆరా తీశారు ధరా మక్వానా భర్త గోపి. వారు తమ పిల్లలను సమర్థించారు. మా బిడ్డలు ఆ ఆహారాన్ని ముట్టరని చెప్పారు. పిల్లలు భోజనం చేయని కారణంగా చాలా వృథా అవుతోంది. దీంతో గోపి పోలీసులను ఆశ్రయించారు. ఇది స్కూలు యంత్రాంగం, జిల్లా యంత్రాంగం తేల్చుకోవల్సిన అంశమని, తాము జోక్యం చేసుకోలేమని పోలీసులు ఆయనకు చెప్పారు. రెండు సమావేశాలు నిర్వహించినా ఫలితం లేదని; పిల్లలకు కులతత్వం వద్దని, అందరూ సమానమని, ఎవ్వరూ అంటరానివారు కాదని నేర్పగలంగానీ తల్లిదండ్రులకు నచ్చజెప్పలేం కదా అంటూ ప్రిన్సిపాల్ అన్నారు. అయితే దేశంలో ఇలాంటివి గతంలోనూ జరిగాయి. 2021, డిసెంబరులో ఉత్తరాఖండ్ స్కూలులో దళిత వంటమనిషి చేసే ఆహారాన్ని అగ్రవర్ణాల పిల్లలు ముట్టలేదు. దళితురాలిని వంట మనిషిగా నియమించడానికి వ్యతిరేకంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమ పిల్లలను స్కూల్లో భోజనం చేయొద్దు అని చెప్పి ఇంటి నుంచి భోజనం ఇచ్చి పంపేవారు. దీంతో వంటమనిషి ఉద్యోగం పోయింది. ఆమె ఎస్సీ, ఎస్టీ దురాగతాల చట్టం కింద ఐపీసీలోని సెక్షన్ల ప్రకారం కేసు పెట్టగా ఉద్యోగం తిరిగి లభించింది. ఈ ఏడాది మేలోనూ ఇదే స్కూలు వార్తల్లో నిలిచింది. అగ్రవర్ణాల పిల్లలు భోజనం చేయమని మరోమారు చెప్పడమే కారణం.

మూడు డోర్ల నుంచి దిగే అవకాశం

ఇండిగో ప్రకటన

న్యూఢిల్లీ : ప్రయాణికుల సౌలభ్యం, సమయం ఆదా చేసుకోవడం కోసం విమానంలోని మూడు డోర్ల నుంచి ప్రయాణికులు కిందకు దిగేలా చర్యలు తీసుకున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో తెలిపింది. గురువారం నుంచే ఈ ప్రక్రియను మొదలు పెట్టినట్టు ఒక ప్రకటన విడుదల చేసింది.. సాధారణంగా ప్రతి విమానంలో రెండు వైపుల ఉన్న డోర్ల నుంచే ప్రయాణికులను కిందకు దించుతున్న విషయం తెలిసిందే. అయితే నేటి నుంచి తమ విమానయాన సంస్థ విమానంలోని రియర్ ఎక్జిట్ నుంచి కూడా ప్రయాణికులు కిందకు దిగే ఏర్పాటు చేసినట్టు తెలిపింది. గురువారం 16వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో ఆ సంస్థ సీఈవో రోనోజోయ్ దత్తా దిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ విమానంలోని రెండు డోర్ల నుంచి ప్రయాణికులందరూ దిగడానికి 14 నిముషాలు పడుతుందని అదే మూడు డోర్ల నుంచి ప్రయాణికులు కిందకు దిగడం వల్ల అందులో ఐదారు నిమిషాలు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఇది విమానాలు వేగంగా తిరగడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం బెంగళూరు, ముంబై, దిల్లీ నగరాల్లోని విమానాశ్రయాల్లో ఈ పద్ధతిని అవలంభిస్తున్నట్టు తెలిపారు.

సమ్మెలో పాల్గొన్న ఉద్యోగుల వివరాలివ్వండి

కేరళ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

కొచ్చి: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మార్చి 28, 29 తేదీల్లో జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా విధులకు హాజరుకాని ఉద్యోగుల వివరాలు ఇవ్వాల్సిందిగా కేరళ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమ్మెలో పాల్గొనడానికి ఉద్యోగులకు సెలవు ఇచ్చారా? లేక అనుమతించారా? అనే విషయాలు వెల్లడించాలని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి సూచించింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా సమ్మెలో పాల్గొంటే వారిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారో తెలపాలని, దీనికి సంబంధించి సవివరమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను ఆగస్టు 24కి వాయిదా వేసింది. ఆ రెండు రోజులు విధులకు హాజరుకాని ఉద్యోగులపై కేరళ సర్వీసు నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు ప్రారంభించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిన తర్వాత ఆ వివరాలన్నీ తమకు అందజేయాలని హైకోర్టు చెప్పింది. సమ్మెలో పాల్గొని..అనధికారికంగా విధులకు హాజరుకాని ఉద్యోగులకు నోటీసులు జారీ చేసినట్లు చీఫ్ జస్టిస్ ఎస్.మణికుమార్, జస్టిస్ షాజీ పి.చాలీతో కూడిన ధర్మాసనానికి రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అనధికారిక సెలవు తీసుకున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించినట్లు వివరించింది. నో వర్క్- నో పే ప్రకటించడానికి బదులుగా సమ్మెలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వమే ఉద్యోగులకు సెలవు ఇచ్చిందని, తమ ఉద్యోగులకు ఆ రెండు రోజులు వేతనాలు చెల్లించిందని, సార్వత్రిక సమ్మెకు ప్రభుత్వమే ఆర్థికంగానూ, అన్ని రకాలుగా సాయమందించిందని ఆరోపిస్తూ న్యాయవాది చంద్రచూడన్ నాయర్ ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడం రాజ్యాంగ వ్యతిరేకమని, విధులకు హాజరుకాని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నాయర్ విజ్ఞప్తి చేశారు.

'గర్బా' సాంస్కృతిక కార్యక్రమాలపై

18 శాతం జీఎస్‌టీ

గుజరాత్‌లో ప్రతిపక్షాల ఆందోళన

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని ప్రధాన నగరాల్లో తొమ్మిది రోజుల పాటు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 'గర్బా' పేరుతో చేపట్టే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన ఎంట్రీ టికెట్లు, పాస్‌లపై 18 శాతం జీఎస్‌టీ విధించడాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్, ఆప్ పార్టీలు వ్యతిరేకించాయి. గర్బా ఈవెంట్‌ల ప్రవేశ పాస్‌లపై విధిస్తోన్న 18 శాతం వస్తు సేవల పన్నును ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తూ వడోదర, అహ్మదాబాద్, సూరత్ తదితర నగరాల్లో ఆందోళన చేపట్టాయి. వడోదర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుత్విజ్ జోషి నేతృత్వంలో 10 మంది కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. వడోదరకు చెందిన యునైటెడ్ వే ఆఫ్ బరోడా అనే సంస్థ గార్బా ఈవెంట్‌కు సంబంధించిన పాస్‌ల ధరలను తమ వెబ్‌సైట్‌లో ప్రచురించిందని, ఇందులో పురుషులకు రూ. 4,838, ధర నిర్ణయించి అందులో రూ. 738 లను 18 శాతం జీఎస్‌టీగా వసూలు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలకు ప్రవేశ రుసుము రూ. 1,298గా ఉంటే ఇందులో రూ. 198 జీఎస్టీగా ఉందని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా వస్తు సేవల పన్ను వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

తక్షణమే దాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు. గర్బా ఈవెంట్‌లపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని గుజరాత్ ఆప్ అధ్యక్షుడు గోపాల్ ఇటాలియా సీఎం భూపేంద్ర పటేల్‌కు లేఖ రాశారు. ప్రజల విశ్వాసాలపై పన్నులు ఏమిటని ప్రశ్నించారు. ఈ విమర్శలపై స్పందించిన గుజరాత్ విద్యా మంత్రి జితు వాఘని మాట్లాడుతూ...2017 నుంచే గర్బా సహా ఇతర సాంస్కృతిక కార్యక్రమాల ప్రవేశ పాసులపై పన్నులు అమలులో ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నాయని పేర్కొన్నారు. ఈ పన్నుల విధానానికి సంబంధించి 2017లోనే కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు.

వివిధ రాష్ట్రాల్లో భారీగా ఐఏఎస్, ఐపీఎస్ ఖాళీలు

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్రాల్లో జనవరి 1, 2022 నాటికి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్)లో 1,472, ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)లో 864 ఖాళీలు ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం తెలిపారు. బస్వాన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా నేరుగా రిక్రూట్ చేయబడిన ఐఎఎస్ అధికారులను సరైన రీతిలో తీసుకోవడానికి, సీఎస్‌ఈ-2012 నుంచి సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సిఎస్ఇ) ద్వారా ప్రభుత్వం వార్షిక ప్రవేశాన్ని 180కి పెంచిందని రాజ్యసభలో ఆయన రాతపూర్వక సమాధానమిచ్చారు. 01.01.2022 నాటికి, వివిధ రాష్ట్రాల్లో ఐఏఎస్‌లో 1,472, ఐపీఎస్‌లో 864 ఖాళీలు ఉన్నాయి" అని మంత్రి చెప్పారు. ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయడం అనేది నిరంతర ప్రక్రియ. కేడర్‌లోని ఖాళీలను భర్తీ చేయడం కేంద్ర ప్రభుత్వ ప్రయత్నమని ఆయన అన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతి సంవత్సరం ఐఏఎస్, ఐపీఎస్ కేటగిరీలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఖాళీల కోసం సివిల్ సర్వీసెస్ పరీక్షను నిర్వహిస్తుంది.

పీఎంఓలో 12 రాష్ట్రాలకు చెందిన 14మంది ఐఏఎస్ అధికారులు

12 రాష్ట్ర క్యాడర్‌లకు చెందిన 14 మంది ఐఎఎస్ అధికారులు ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ)లో ఉన్నట్లు గురువారం కేంద్రం రాజ్యసభకు తెలిపింది. గుజరాత్, బీహార్ కేడర్‌లకు చెందిన ఇద్దరు అధికారులు, ఉత్తరాఖండ్, తెలంగాణ, సిక్కిం, మణిపూర్, మహారాష్ట్ర, నాగాలాండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఏజీఎంయూటీ (అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరాం యూనియన్ టెరిటరీ) కేడర్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున అధికారులు ఉన్నట్టు కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సమాధానమిచ్చారు. పీఎంఓలో లేటరల్ ఎంట్రీ ద్వారా నియమితులైన అధికారుల సంఖ్యను కోరుతూ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

జార్ఖండ్ ఎమ్మెల్యేల నగదు సీజ్

బెంగాల్ సీఐడీ బృందాలు దిల్లీ, గువహటిలో నిర్బంధం

కోల్‌కతా: జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేల నుంచి నగదు స్వాధీనానికి సంబంధించిన దర్యాప్తు క్రమంలో రెండు స్థానాల్లో తనిఖీలకు వెళ్లిన తమ బృందాలను న్యూదిల్లీ, గువహటిలో స్థానిక పోలీసులు అడ్డుకున్నట్లు పశ్చిమ బెంగాల్ సీఐడీ తెలిపింది. అరెస్టు అయిన ముగ్గురు శాసన సభ్యులకు సన్నిహితుడికి సంబంధించి దిల్లీలోని ఆస్తులను సోదా చేసేందుకు వెళ్లిన తమ అధికారులను అక్కడి పోలీసులు బుధవారం నిర్బంధించినట్లు దర్యాప్తు సంస్థ సీనియర్ అధికారి తెలిపారు. కోర్టు వారెంటు ఉన్నాగానీ వారిని అడ్డుకున్నారన్నారు. ఇనస్పెక్టర్, ఏఎస్ఐ, ఇద్దరు ఎస్ఐలతో కలిపి నలుగురు సీఐడీ అధికారులను దిల్లీ పోలీసులు అడ్డుకున్నారని, కోర్టు వారెంటు ఉన్నాగానీ రాజధానిలోని దక్షిణ క్యాంపస్ పోలీసు స్టేషన్ పరిధిలోగల నిందితుడి నివాసంలో సోదాలు జరపనివ్వలేదని అధికారి చెప్పారు. జార్ఖండ్‌కు చెందిన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇర్ఫాన్ అన్సారి, రాజేశ్ కచ్‌చాప్, నమన్ బిగ్జల్ కొంగరిలను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. వారు ప్రయాణించే కారు నుంచి రూ.49లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా, కేంద్రప్రభుత్వం పరిధిలో ఉండే దిల్లీ పోలీసులు ఈ వ్యవహారంలో స్పందించారు. సీఐడీ బృందానికి అన్ని విధాలా సహకరించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో న్యాయ సలహా కోరగా ఆ వారెంటు చెల్లదని తేలిందని, అదే విషయాన్ని పశ్చిమ బెంగాల్ పోలీసులకు తెలపామని డీసీపీ మనోజ్ వెల్లడించారు. అసోంలో పోలీసు సిబ్బంది నిర్బంధంపై సీఐడీ అధికారి ఒకరు స్పందించారు. బీజేపీ పాలిత ఈశాన్య రాష్ట్రంలోని అధికారులతో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. గువహటి పోలీసు సీనియర్ అధికారి మాట్లాడుతూ, పక్క రాష్ట్రానికి చెందిన దర్యాప్తు బృందాన్ని పూర్తిగా సహాయ, సహకారాలు అందించామని చెప్పారు. నిర్బంధించినట్లు వచ్చిన వార్తలు నిరాధారమన్నారు. ఇవన్నీ ఊహాగానాలు, మా వాహనాల్లోనే వారిని కావాల్సిన చోటుకు తీసుకు వెళ్లాం అని ఆయన తెలిపారు. ఇదిలావుంటే, మంత్రి పదవుల ఆశ చూపి రూ.10కోట్లు ఇస్తామని ఎమ్మెల్యేలను తమ వైపుకు తిప్పుకొని రాష్ట్రంలోని హేమంత్ సోరెన్ ప్రభుత్వాన్ని కూల్చివేయాలని బీజేపీ యత్నిస్తోందని జేఎంఎం ప్రభుత్వంలో భాగమైన కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కుట్రలో అసోం సీఎం హిమంతా బిశ్వశర్మ హస్తం ఉందని పేర్కొంది. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు తమపై ఆరోపణలు చేస్తోందని విమర్శించింది.

సుప్రీంలో ఉద్ధవ్‌ఠాక్రేకు ఊరట

షిండే వర్గం పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవద్దని ఈసీకి ఆదేశం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేకు ఊరట లభించింది. శివసేన విడిపోయిన తమ వర్గాన్ని అసలైన శివసేనగా పరిగణించి, ఎన్నికల గుర్తును కేటాయించాలంటూ ఏక్‌నాథ్ షిండే వర్గం చేసిన విజ్ఞప్తిపై ఇప్పట్లో ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు గురువారం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఇటీవలి మహారాష్ట్ర రాజకీయ సంక్షోభానికి సంబంధించిన అంశాలను రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేయడంపై సోమవారం నిర్ణయం తీసుకుంటా మని ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. షిండే వర్గం పిటిషన్‌పై నోటీసులకు స్పందన తెలపడానికి ఠాక్రే వర్గం సమయం కోరితే, వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కూడా న్యాయమూర్తులు కృష్ణ మురారి , హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం ఎన్నికల సంఘానికి సూచించింది. ఇటీవలి మహారాష్ట్ర రాజకీయ సంక్షోభం నేపథ్యంలో శివసేన , దాని తిరుగుబాటు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. తొలుత షిండే వర్గం తరపున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, ప్రత్యర్థి ఉద్ధవ్ ఠాక్రే గ్రూప్ దాఖలు చేసిన పిటిషన్లపై సవరించిన చట్టపరమైన అంశాల జాబితాను కోర్టుకు సమర్పించారు. ఫిరాయింపుల నిరోధక చట్టం అసమ్మతి నిరోధక చట్టం కాదని సాల్వే అన్నారు. అనర్హత నిర్ధారణ అయ్యేంత వరకు చట్టవిరుద్ధమనే సూత్రమేదీ లేదని సాల్వే చెప్పారు. అయితే 'మీరు ఎన్నికైన తర్వాత రాజకీయ పార్టీని పూర్తిగా విస్మరిస్తే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఠాక్రే వర్గం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ... 40 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలు వారి ప్రవర్తనతో అనర్హులుగా మారారని, వారు నిజమైన శివసేన అని చెప్పలేరని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్...ఎన్నికల సంఘం ప్రజాప్రాతినిధ్య చట్టం ద్వారా నిర్వహించబడుతుందని, ఒక వర్గం క్లెయిమ్ లేవనెత్తితే, దానిని నిర్ణయించవలసి ఉంటుందని తెలిపారు. 'పదో షెడ్యూల్ వేరే పరిధి. ఒకవేళ అనర్హులైతే చట్టసభలో సభ్యులుగా ఉండటాన్ని రద్దు చేస్తారు. రాజకీయ పార్టీ సభ్యులుగా కాదు. ఇవి భిన్నమైనవి. అసెంబ్లీలో ఏం జరిగినా దానికి రాజకీయ పార్టీ సభ్యత్వానికి ఎలాంటి సంబంధం లేదు' అని దాతర్ అన్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ వారి రాజకీయ పార్టీ నుండి ఎన్నికైన, నామినేట్ చేయబడిన సభ్యుల ఫిరాయింపులను నిరోధించడానికి అవకాశం కల్పిస్తుంది. ఫిరాయింపులకు వ్యతిరేకంగా కఠిన నిబంధనలను కలిగి ఉందని చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు విధేయులైన పార్టీ ఎమ్మెల్యేలతో కూడిన వర్గం, మరో రాజకీయ పార్టీలో విలీనం కావడం ద్వారానే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం అనర్హత వేటు నుంచి తమను తాము రక్షించుకోగలరని శివసేనకు చెందిన ఉద్ధవ్ ఠాక్రే వర్గం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపింది.

సంజయ్ రౌత్ కస్టడీ పొడిగింపు

ముంబై: మనీలాండరింగ్ కేసులో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీని ముంబైలోని ప్రత్యేక కోర్టు గురువారం ఆగస్టు 8 వరకు పొడిగించింది. ఈడీ దర్యాప్తులో "అద్భుతమైన పురోగతి" సాధించిందని కస్టడీని పొడిగిస్తున్న సమయంలో కోర్టు వ్యాఖ్యానించింది. సబర్బన్ గోరెగావ్‌లోని పత్రా 'చాల్' (పాత వరుస అద్దె) పునరాభివృద్ధిలో ఆర్థిక అవకతవకలు, అతని భార్య ఆరోపించిన సహచరులకు సంబంధించిన ఆర్థిక ఆస్తుల లావాదేవీలకు సంబంధించి కేంద్ర ఏజెన్సీ ఆదివారం అర్ధరాత్రి రౌత్‌ను అరెస్టు చేసింది. సోమవారం కోర్టు అతడిని ఆగస్టు 4 వరకు ఈడీ కస్టడీకి అప్పగించింది. ప్రాథమిక రిమాండ్ ముగింపులో, దర్యాప్తు సంస్థ రౌత్‌ను ప్రత్యేక మనీలాండరింగ్ చట్టం కోర్టు న్యాయమూర్తి ఎంజీ దేశ్‌పాండే ముందు హాజరుపరిచింది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ కోసం అతడి కస్టడీని పొడిగించాలని కోరింది. రెండు పక్షాల వాదనలు విన్న కోర్టు ఆగస్టు 8 వరకు కస్టడీని పొడిగించింది.

కేరళలో ప్రత్యేక స్కూళ్ల కోసం ప్యానల్

తిరువనంతపురం: మానసిక దివ్యాంగ పిల్లలు చదివే ప్రత్యేక బడులకు ఆర్థిక ప్యాకేజీలు ఇచ్చేందుకు, అర్హతలను సమీక్షించేందుకు ప్రత్యేక ప్యానల్‌ను కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విద్యామంత్రి వి.శివన్‌కుట్టి అధ్యక్షతన స్పెషల్ స్కూళ్ల యంత్రాంగాలతో జరిగిన సమావేశంలో ప్రత్యేక ప్యానల్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ ప్యానల్‌కు అదనపు డైరెక్టర్ (పబ్లిక్ ఇనస్ట్రక్షన్స్) షినిమాన్ చైర్మన్‌గా, సంయుక్త కార్యదర్శి (పబ్లిక్ ఇనస్ట్రక్షన్స్) జయశ్రీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఆర్‌కే జయప్రకాశ్ మరో ఇద్దరు సభ్యులుగా ఉంటారు అని అధికారిక ప్రకటన పేర్కొంది. ఆర్థిక ప్యాకేజీలు పొందేందుకు ప్రస్తుతమున్న అర్హతలను సమయానుగుణంగా మార్పులు చేసేందుకు వీలు ఉంటుందని తెలిపింది.

సోషల్ మీడియా సమ్మతిపై త్రైమాసిక ఆడిట్లు

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల సమ్మతిపై త్రైమాసిక ఆడిట్‌లను ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ (మైటీ) నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. 2021, ఐటీ నిబంధనల విషయంలో సామాజిక మాధ్యమాలు ప్రతినెలా తమ సమ్మతిని తెలపాలి. ఆయా మార్గదర్శకాలకు అనుగుణంగా తీసుకున్న చర్యలను వెల్లడించాలి. అయితే, వచ్చే ఫిర్యాదులను సామాజిక మాధ్యమాలు సక్రమంగా నివేదిస్తున్నాయా; లేదా? నియమాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాయా? వంటి అంశాలను ఈ ఆడిట్‌లో అధికారులు పరిశీలిస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. సామాజిక మాధ్యమాల నియంత్రణ కోసం అప్పిల్లేట్ ప్యానల్‌ను ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం విదితమే.

బీజేపీలో చేరిన కుల్దీప్ విష్ణోయ్

న్యూఢిల్లీ: హరియాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే కుల్దీప్ విష్ణోయ్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. భార్య రేణుకా విష్ణోయ్‌తో కలిసి గురువారం సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ సమక్షంలో బీజేపీలో చేరారు. మాజీ సీఎం భజన్ లాల్ చిన్న కుమారుడైన విష్ణోయ్ మాట్లాడుతూ...నరేంద్ర మోదీ ఉత్తమ ప్రధాని అని కొనియాడారు. ఎనిమిదేళ్లకు పైగా ముఖ్యమంత్రిగా ఉన్న ఖట్టర్ మచ్చలేని నేత అని కీర్తించారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో మోదీని ప్రధానిని చేసేందుకు బీజేపీ చేపట్టిన ప్రచారంలో తాను, తన సహచరులు ఉన్నట్టు తెలిపారు. అనంతరం కొన్ని విభేదాలు వచ్చాయని పేర్కొన్నారు. అయినా దేశం గురించి, పేదల సంక్షేమం గురించి నిత్యం ఆలోచించే ఉత్తమ ప్రధాని మోదీ అని పేర్కొన్నారు. పార్టీలో చేరిన అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షకావత్ తదితరులను కలశారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి భిన్నంగా బీజేపీ అభ్యర్థికి విష్ణోయ్ ఓటు వేయడంతో కాంగ్రెస్ పార్టీ ఆయన్ను బహిష్కరించిన విషయం తెలిసిందే.

ఆజంగఢ్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

లక్నో: సంకుచిత మనస్తత్వం గల విభజన శక్తుల కారణంగా ఆజంగఢ్ యువకులు ఒకప్పుడు తమ గుర్తింపును దాచుకోవాల్సి వచ్చిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గురువారం అన్నారు. ఆజంగఢ్ లోక్‌సభ ఉపఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత తొలిసారి ఇక్కడకొచ్చిన ఆదిత్యనాథ్... ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్ రాజీనామా చేసిన ఈ నియోజకవర్గంలో సుమారు రూ.145 కోట్ల విలువైన 50 అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. గత మార్చిలో జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ర్యాలీలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఎస్పీ ప్రభుత్వ హయాంలో ఆజంగఢ్ ఉగ్రవాదులు, నేరస్థుల నిలయంగా మారిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు వివిధ కార్యక్రమాలకు శంకుస్థాపన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఎంపీగా దినేశ్‌లాల్ యాదవ్‌కు విజయాన్ని అందించినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు చెప్పడానికి నేను ఇక్కడకు వచ్చాను. నేను మీకు రుణపడి ఉంటాను. మీ కోసం 50 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ఇక్కడకు వచ్చాను' అని అన్నారు. గతంలో ఆజంగఢ్‌లోని యువత రాష్ట్రం నుండి బయటకు వెళ్లినప్పుడు తమ గుర్తింపును దాచుకోవాల్సి వచ్చిందన్నారు. వారు తమ గుర్తింపును వెల్లడిస్తే, వారికి హోటళ్లలో, ధర్మశాలల్లో ఉండటానికి గది లభించేది కాదని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ప్రజల ఆలోచనలు మారాయన్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే ఆజంగఢ్ ప్రజలను లక్నో , దిల్లీతో కలిపిందని ఆయన చెప్పారు.

కేరళ 8 జిల్లాల్లో రెడ్ అలర్ట్

తిరువనంతపురం: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తూ, ప్రజల రోజువారీ జీవితాలను అస్తవ్యస్తం చేయడంతో భారత వాతావరణ శాఖ గురువారం కేరళలోని 8 జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించింది. రోడ్లు వరద నీటితో నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు తమ ఇళ్లు ఖాళీ చేసి సహాయ శిబిరాలకు తరలివెళ్లారు. పతనంతిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకులం, ఇడుక్కి త్రిసూర్, పాలక్కాడ్, కన్నూర్ జిల్లాల్లో రెడ్ అలర్ట్‌ని, తిరువనంతపురం మినహా మిగిలిన జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను ఐఎండీ జారీ చేసింది. వర్షాల కారణంగా పతనంతిట్ట జిల్లాలోని పంపా, మణిమాల, అచ్చన్‌కోవిల్ వంటి వివిధ నదుల్లో నీటి మట్టం పెరిగి ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. కోజికోడ్‌లో, ప్రతికూల వాతావరణం కారణంగా మధ్యప్రాచ్యం నుండి కాలికట్ విమానాశ్రయానికి వెళ్లాల్సిన ఐదు విమానాలను కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. షార్జా, అబుదాబి నుంచి ఎయిర్ అరేబియా విమానాలు, బహ్రెయిన్ నుంచి గల్ఫ్ ఎయిర్ విమానం, అబుదాబి నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు, దోహా నుంచి ఖతార్ ఎయిర్‌వేస్ విమానాలను కొచ్చిన్‌కు మళ్లించినట్లు కొచ్చిన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ తెలిపింది.

మెట్టూరు డ్యాం నుంచి నీటి విడుదల

సేలం(తమిళనాడు): జిల్లాలోని పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, స్టాన్లీ రిజర్వాయర్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో చేరడంతో డ్యాం నుంచి కావేరి నదికి గురువారం ఉదయం నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీటి విడుదల పెరిగింది. పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, పొరుగున ఉన్న కర్ణాటకలోని డ్యామ్‌ల నుంచి విడుదలయ్యే నీరు మెట్టూరు డ్యాంలోకి భారీగా వస్తుండటంతో ఇన్‌ఫ్లో పెరిగిందని అధికారిక వర్గాలు తెలిపాయి. నది ఒడ్డున, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు జిల్లా యంత్రాంగం వరద హెచ్చరిక జారీ చేసింది.

రాజస్థాన్‌లో భారీ వర్షం

జైపూర్: రాజస్థాన్‌లో గడచిన 24 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయని, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయని వాతావరణ విభాగం గురువారం తెలిపింది. ప్రతాప్‌గఢ్, పాలి జిల్లాల్లోని ప్రదేశాల్లో భారీ వర్షాలు కురిశాయి. రాణి (పాలి)లో అత్యధికంగా 9.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత ప్రతాప్‌గఢ్‌లో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రష్మీ (చిత్తోర్‌గఢ్), విజయ్ నగర్, జవాజా (రెండూ అజ్మీర్‌లో) 5 సెం.మీ వర్షపాతం నమోదయ్యాయి మరియు అనేక ఇతర ప్రాంతాల్లో 5 సెం.మీ కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

ప్రజాకంటక పాలనకు చరమగీతం

- పాలనలో మోదీ విఫలం
- ప్రభుత్వరంగం నిర్వీర్యం.. కార్పొరేట్లకు పెద్దపీట
- అప్పులు తప్ప అభివృద్ధి శూన్యం
- సీపీఐ విజయనగరం జిల్లా మహాసభలో రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై జల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, రంగరాజు, పావని, కామేశ్వరరావు, రమణ, అశోక్, ఆనందరావు తదితరులు

విశాలాంధ్ర-విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడేందుకు అందరూ కలిసి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. మోదీ, జగన్ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ విజయనగరం జిల్లా మహాసభలో రామకృష్ణ గురువారం మాట్లాడారు. కేంద్రంలో మోదీ పాలన అధ్వాన్నంగా ఉందని ఆయన విమర్శించారు. ఎనిమిదేళ్ల బీజేపీ పాలనలో అభివృద్ధి మాటే లేదన్నారు. 1946-2014 వరకు దేశానికి 47 లక్షల కోట్లు అప్పులుంటే...మోదీ 8 ఏళ్ల పాలనలో అవి రూ.155 లక్షల కోట్లకు చేరాయన్నారు. రూపాయి విలువ దారుణంగా క్షీణించిందని తెలిపారు. నిత్యావసరాలు, గ్యాస్ ధరలు పెరిగాయని, 26 ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా కంటక పాలనపై అక్టోబరు 14 నుంచి విజయవాడలో జరిగే సీపీఐ జాతీయ మహాసభలో తీర్మానాలు చేయడంతో పాటు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని రామకృష్ణ వివరించారు. విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న హామీని ప్రధాని మోదీ పూర్తిగా మర్చిపోయారని మండిపడ్డారు. అధికారం కోసం బీజేపీ మతాలను రెచ్చగొడు తోందన్నారు.

రాష్ట్ర రాజకీయాలను ప్రస్తావిస్తూ రాష్ట్రంలో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని రామకృష్ణ విమర్శించారు. రాష్ట్ర విభజన సమయానికి రూ.96 వేల కోట్ల అప్పుంటే ఇప్పుడది రూ.8.36 లక్షల కోట్లకు చేరిందని చెప్పారు. సీఎంగా జగన్ గద్దె దిగేనాటికి రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పులుంటాయని తెలిపారు. అప్పు చేస్తే తప్ప జీతాలు, పింఛను ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో పురోగతి లేదని, స్పిల్ వే , కాఫర్ డ్యామ్ మాత్రం నిర్మించారని, రాక్ ఫిల్ కట్టలేదన్నారు. పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కృష్ణా డెల్టాకు, రాయలసీమకు ఎంతో ఉపయోగమన్నారు. పోలవరం కోసం 2 లక్షల మంది దళితులు, గిరిజనులు భూములిచ్చారన్నారు. వరదలకు 21 రోజులు ప్రజలు చీకటిలో మగ్గిపోతే కనీసం పట్టించుకోలేదన్నారు. 15 రోజుల తరువాత సీఎం జగన్ వచ్చి..తాను ఇచ్చిన రూ.2 వేలు అందిందా అని అడిగారన్నారు. తెలంగాణలో వరద బాధితులకు రూ.10 వేలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. 31 మంది ఎంపీలున్నా పోలవరం, స్టీల్‌ప్లాంట్‌పై నిలదీయకపోగా కేంద్రానికి మోకరిల్లుతున్నారన్నారు. ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తామని చెప్పడానికి వెళ్లిన టీడీపీ ఎంపీలకు కేంద్రహోం మంత్రి అమిత్ షా కనీస గౌరవం ఇవ్వలేదని రామకృష్ణ విమర్శించారు. వీరంతా రాష్ట్రం పరువును మంట గలుపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై విశాఖలో 26 నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభల్లో భవిష్యతు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జగనన్న కాలనీల నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము ఇసుక, సిమెంటుకే సరిపోతుందన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 19 ప్రాంతాల్లో భూ పోరాటాలు చేశామని, అందులో విజయనగరం జిల్లా మొదటి దన్నారు. జిల్లాలో సుగర్ ఫాక్టరీ, సాగునీరు, వలసలు వంటి ఎన్నో సమస్యలున్నాయన్నారు.

జిల్లాలో సమస్యలపై పార్టీ నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. పార్టీ నాయకులు ఎస్.రంగరాజు, బుగత పావని అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ, ఎస్.కృష్ణ, కోట అప్పన్న, నెల్లిమర్ల నియోజక వర్గ నాయకులు తాలాడ సన్నిబాబు, సీనియరు నాయకులు కాళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా కోనాల భీమారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరుగుతున్న సీపీఐ జిల్లా 26వ మహాసభల్లో గురువారం మూడవ రోజు జరిగిన ప్రతినిధుల సభలో పార్టీ జిల్లా కార్యదర్శిగా భీమారావు తో పాటు 9 మంది జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిపి 31 మంది జిల్లా సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, బొద్దాని నాగరాజు, వైట్ల విద్యాధర్, కళింగ లక్ష్మణరావు, సికిలే పుష్పకుమారి, నెక్కంటి క్రాంతి కుమార్, ఆహ్వానితుడుగా టి.అప్పలస్వామి ఎన్నికయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి.ఓబులేసు, కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు కార్యదర్శిగా ఎన్నికైన కోనాల భీమారావుకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీశైలం జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: శ్రీశైలం ప్రాజెక్టు ఎగువ భాగాన కురుస్తున్న వర్షాల కారణంగా జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. జూరాల స్పిల్‌వే నుంచి 28,469 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి వలన 41,937 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,24,504 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల నీరు మొత్తంగా 1,95,160 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు కుడిగట్టు జలవిద్యుత్ ద్వారా 30,460 క్యూసెక్కులు, తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి నుంచి 31,784 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతి ద్వారా 1688 క్యూసెక్కులు, పోతిరెడ్డి పాడు ఎత్తిపోతల పథకం ద్వారా 24,000 క్యూసెక్కులు మొత్తం 1,15,594 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884.10 అడుగుల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో పూర్తి నీటి నిల్వలు 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 210.5133 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మహిళల రెయిన్‌వాక్, సైక్లింగ్ పోటీలకు కేరళ ఆతిథ్యం

కోచికోడ్(కేరళ): కేరళ రాష్ట్రంలో మహిళా సాహస ప్రియులకు కేరళ టూరిజం ప్రత్యేకంగా రెయిన్‌వాక్, సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తోంది. ఆగస్టు 8న ఉత్తర జిల్లాలోని తుషారగిరిలో రెయిన్‌వాక్ నిర్వహించనున్నారు. వరల్డ్ ఆఫ్ ఉమెన్ అనే స్వతంత్ర ట్రావెల్ గ్రూప్‌తో కలిసి రాష్ట్ర పర్యాటక శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నది. ఆగస్టు 7న జరగాల్సిన సైక్లింగ్ కార్యక్రమం మనంచిరలో ప్రారంభమై ఆగస్టు 7న పులిక్కాయలో ముగుస్తుందని, జిల్లా కలెక్టర్ తేజ్ లోహిత్ రెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆగస్టు 12 నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ కయాకింగ్ పోటీలు-మలబార్ రివర్ ఫెస్టివల్‌కు సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన కయాకర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

మోదీకి భయపడను

ఈడీ దాడులపై రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీకి తాను భయపడే ప్రసక్తేలేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీని అడ్డుపెట్టుకొని తమను బెదిరించలేరని తేల్చి చెప్పారు. హెరాల్డ్ హౌస్‌లో యంగ్ ఇండియన్ కార్యాలయాన్ని ఈడీ సీల్ చేయడం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, సోనియా, రాహుల్ ఇళ్ల వద్ద ఢిల్లీ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంపై రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. రాహుల్‌గాంధీ గురువారం పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ తనను భయపెట్టడానికి మోదీ అనేక ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మోదీకి తాను భయపడేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేషనల్ హెరాల్డ్ కార్యాలయంలోని యంగ్ ఇండియన్ గదులకు ఈడీ సీల్ వేసిన తర్వాత రాహుల్ మొదటిసారిగా స్పందించారు. 'వారు ఏమి చేయాలనుకుంటే అది చేసుకోనివ్వండి. అది సమస్య కాదు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం నా పనులు కొనసాగిస్తాను. దేశంలో మత సామరస్యతను కాపాడటానికి కృషి చేస్తాను. మోదీ, ఎన్‌డీఏ ప్రభుత్వం ఏమి చేయాలనుకుంటే అది చేసుకోవచ్చు. నా విధులను మాత్రం నేను విస్మరించను' అని రాహుల్ తేల్చి చెప్పారు. ప్రభుత్వం, ప్రధానిపై తన విమర్శలను ఆపేది లేదని తెలిపారు. 'నిజాన్ని ఎవరూ కప్పి పెట్టలేరు. మాపై ఒత్తిడి పెంచడం ద్వారా మేము నోరు విప్పకుండా ఉండాలని బీజేపీ ప్రభుత్వం కోరుకుంటుంది. మేం మౌనంగా ఉండటం సాధ్యపడదు. దేశానికి, ప్రజలకు వ్యతిరేకంగా నరేంద్రమోదీ, అమిత్‌షా చేస్తున్న ఎలాంటి చర్యలనైనా తిప్పికొడతాం. ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడతాం' అని వ్యాఖ్యానించారు.

బార్బడోస్ చిత్తు... సెమీస్‌కు భారత్

బర్మింగ్‌హామ్: కామన్వెల్త్ మహిళా క్రికెట్ కీలక మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో బార్బడోస్‌ను చిత్తుగా ఓడించి గ్రూప్-ఎ నుంచి సెమీస్‌కు దూసుకెళ్లింది. బ్యాటింగ్‌లో రోడ్రిగ్స్ (56 నాటౌట్, 46 బంతుల్లో 6×4, 1×6), బౌలింగ్‌లో రేణుకా సింగ్ 4/10 విజృంభించిన వేళ భారత్ 100 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. బార్బడోస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి కేవలం 62 పరుగులు మాత్రమే చేసింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టుకు ఆరంభంలో షాక్ తగిలింది. షకెరా సెల్మాన్ వేసిన రెండో ఓవర్లో ఓపెనర్ స్మృతీ మంధాన (5) ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేరింది. ఆపై షఫాలీ వర్మ (43), రోడ్రిగ్స్ (56) దూకుడుగా ఆడుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. వీరిద్దరూ కలిసి 71 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 9 ఓవర్లో షఫాలీ రనౌట్ కాగా, ఆ వెంటనే వచ్చిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ డకౌట్ అయింది. ఆ తర్వాత తానియా (6) కూడా నిరాశపరచగా, రోడ్రిగ్స్‌తో కలిసి దీప్తి శర్మ (31 నాటౌట్) స్కోర్ బోర్డును ముందుకు తీసుకెళ్లారు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. 163 పరుగుల లక్ష్యఛేదనలో బార్బడోస్ బ్యాటర్లు చతికిలపడ్డారు. ఆది నుంచి భారత బౌలర్లు వరుసగా వికెట్లు తీస్తూ ఆ జట్టును కోలుకోలేని దెబ్బతీశారు. టీమిండియా బౌలర్లలో రేణుకా సింగ్ 4 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేయగా, మేఘ్నా సింగ్, స్నేహ రాణా, రాధా యాదవ్, హర్మన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. బార్బడోస్ బ్యాటర్లలో కైషోనా నైట్ (16) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

బాక్సింగ్‌లో సెమీస్‌కు భారత్

నాలుగో పతకం ఖాయం

బర్మింగ్‌హామ్: కామన్వెల్త్ క్రీడల్లో బాక్సింగ్‌లో భారత్‌కు నాలుగో పతకం ఖాయమైంది. గురువారం ఫ్లైవెయిట్ (48-51 కేజీల) పోటీల క్వార్టర్ ఫైనల్లో స్కాట్లాండ్‌కు చెందిన లెనన్ ముల్లిగన్‌ను భారత బాక్సర్ అమిత్ పంగల్ ఓడించాడు. దీంతో అతడు సెమీస్ పోరుకు అర్హత సాధించాడు. పంగల్ ఈ పోటీలో తొలుత డిఫెన్స్ చేసుకొని ముల్లిగన్‌కు ఆధిక్యం ఇవ్వకుండా తెలివిగా ఆడాడు. తర్వాత వీలుచిక్కినప్పుడు ప్రత్యర్థిపై పిడిగుద్దులు కురిపించి అనూహ్యంగా పాయింట్లు సాధించాడు. దీంతో ప్రత్యర్థిపై తేలిగ్గా విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. మరోవైపు బాక్సింగ్‌లో ఇప్పటికే నిఖత్ జరీన్ (50 కేజీలు), నితు గంగాస్ (48 కేజీలు), మహ్మద్ హుస్సాముదిన్ (57 కేజీలు) సైతం వివిధ విభాగాల్లో సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. దీంతో బాక్సింగ్‌లో భారత్‌కు నాలుగు పతకాలు సొంతం కానున్నాయి. అలాగే భారత స్టార్ స్ప్రింటర్ హిమదాస్ సైతం గురువారం మహిళల 200 మీటర్ల హీట్‌లో విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించింది. ఈ పోటీలో ఆమె కేవలం 23.42 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది.

ప్రి-క్వార్టర్స్‌కు సింధు, శ్రీకాంత్

కామన్వెల్త్ క్రీడల్లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మహిళల సింగిల్స్ విభాగంలో ప్రి క్వార్టర్స్‌కు చేరింది. గురువారం జరిగిన 32వ రౌండ్‌లో మాల్దీవ్స్ షట్లర్ ఫాతిమా నబా అబ్దుల్ రజాక్‌ను 21-4, 21-11 తేడాతో చిత్తుగా ఓడించింది. ఈ పోటీలో సింధు వరుసగా రెండు సెట్లు గెలిచి కేవలం 21 నిమిషాల్లోనే సునాయాసంగా విజయం సాధించింది. తొలి గేమ్‌లో ఫాతిమా తేలిపోగా రెండో గేమ్ తొలి భాగంలో కాస్త గట్టి పోటీనిచ్చింది. దీంతో ఒకానొక సమయంలో సింధుతో 9-9 స్కోర్‌తో సమానంగా నిలిచింది. అయితే తర్వాత పుంజుకున్న సింధు రెండో గేమ్‌లో విరామ సమయానికి 11-9తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక తర్వాత మరింత చెలరేగిన భారత షట్లర్ ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా 21-11తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరోవైపు పురుషుల సింగిల్స్ పోటీలో కిదాంబి శ్రీకాంత్.. ఉగాండాకు చెందిన డేనియల్ వానాగలియాను 21-9, 21-9 తేడాతో ఓడించి ప్రిక్వార్స్‌కు చేరాడు.

చివరి రెండు టీ20లు యథాతథం

ఆటగాళ్లకు యూఎస్ వీసాల మంజూరు

లండన్: విండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో 2-1తేడాతో భారత్ ముందంజ వేసింది. మిగిలిన రెండు మ్యాచ్‌లు అమెరికాలోని ఫ్లోరిడా వేదికగానే జరుగుతాయని విండీస్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం తొలుత ఫ్లోరిడానే వేదిక. అయితే, ఆటగాళ్లకు బుధవారం వరకు వీసాలు లభించకపోవడంతో వెస్టిండీస్‌లోనే నిర్వహించాలని బోర్డు భావించింది. అయితే, గురువారం యూఎస్ వీసాలు మంజూరు కావడంతో యథావిధిగా అమెరికాలో ఆఖరి రెండు టీ20లను నిర్వహిస్తున్నట్లు విండీస్ బోర్డు ప్రకటించింది. గయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ జోక్యంతోనే వీసాల ప్రక్రియ సజావుగా సాగిందని తెలిపింది. తొలి టీ20 మ్యాచ్ బ్రియాన్ లారా స్టేడియంలో జరగగా.. రెండు, మూడు టీ20లు సెయింట్ కిట్స్‌లోని వార్నర్ పార్క్ మైదానంలో జరిగాయి. మంగళవారమే మూడో టీ20 మ్యాచ్ ముగిసింది. అక్కడి నుంచే నేరుగా ప్రత్యేక విమానంలో ఆటగాళ్లు ఫ్లోరిడా బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ, వీసాల మంజూరులో జాప్యం కావడంతో గురువారం వెళ్లే అవకాశాలు ఉన్నాయని విండీస్ క్రికెట్ బోర్డు ప్రతినిధులు వెల్లడించారు. తొలి టీ20 జరిగిన ట్రినిడాడ్ నుంచి ఆటగాళ్ల లగేజీ రాకపోవడంతో రెండు, మూడో మ్యాచ్‌లు ఆలస్యంగా నిర్వహించిన విషయం తెలిసిందే. విండీస్ బోర్డు సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోందనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు వీసాలను తెచ్చుకోవడంలోనూ అలసత్వం ప్రదర్శించిందనే ఆరోపణ లేకపోలేదు.

హమాలీలకు కూలి పెంచకపోవడం దుర్మార్గం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

ధర్నాలో పాల్గొన్న ఓబులేసు, వెంకట సుబ్బయ్య, చిన్న ఆంజనేయులు, ఉమా మహేశ్వరరావు, యాకూబ్, దాసు తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ: సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ పరిధిలోని మండల స్టాక్ పాయింట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలి రేట్లు పెంచకపోవడం దుర్మార్గమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. పాత అగ్రిమెంట్ ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా కూలి రేట్లు పెంచకపోవడం దారుణమని పేర్కొన్నారు. కూలి రేట్లు పెంపు, పీఎఫ్, ఈఎస్‌ఐ తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ స్థానిక ఆటోనగర్‌లోని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయం ఎదుట హమాలీలు చేపట్టిన దర్నాలో పాల్గొన్న ఓబులేసు మాట్లాడుతూ ప్రతి రోజు ప్రజలకవసరమైన బియ్యం, పంచదార, గోధుమలు, ఇతర ఆహార పదార్థాలను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయడంలో హమాలీలు కీలకంగా పని చేస్తారని చెప్పారు. హమాలీలు కష్టపడి పని చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ బియ్యం పథకం పెట్టి ఆటోల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నారని, గోడన్లలో హమాలీలు బియ్యం లోడ్ చేయకుండా, అన్‌లోడ్ చేయకుండా, కాటా వేయకుండా ఇంటింటికీ రేషన్ సరఫరా సాధ్యమా అని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలి రేట్లు పెంచాలని డిమాండు చేశారు. ఈ నెలాఖరులోపు సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ హమాలీలకు ప్రస్తుతం క్వింటాకు ఇస్తున్న రూ.22 కూలిని రూ.30లకు పెంచాలని తాము కోరామని చెప్పారు. న్యాయబద్ధమైన కోరికను పట్టించుకోని సివిల్ సప్లయిస్ ఎండీ కేవలం రెండు రూపాయలు పెంచుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి, కమిషనర్ జోక్యం చేసుకుని కూలి రేట్లు పెంచాలని, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని, కొత్తగా పనిలో చేరినవారికి పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని కోరారు. హమాలీలకు బోనస్ కూడా పెంచాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండు చేశారు. హమాలీ ఫెడరేషన్ అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు, సీఐటీయూ నేత కె.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి విపత్తులు వచ్చినా హమాలీ కార్మికులు కష్టపడి పని చేస్తూ ప్రజలకు బియ్యం సరఫరా చేస్తున్నారని, కరోనా సమయంలో కూడా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పేదలకు బియ్యం అందేలా చూసిన హమాలీలకు కూలి రేట్లు పెంచడానికి ప్రభుత్వానికి మనసు రాకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మన్మథరావు, చిక్కాల గోవిందు, వీరబాబు, సూరి, అయ్యప్ప, పెంచలయ్య, యాకూబ్, దాసు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలి పెంచమంటే... అక్రమ అరెసులా?: వెలుగూరి రాధాకృష్ణమూర్తి

ముఠా కార్మికులకు కూలీరేట్లు పెంపుదల చేయమని అడిగితే అక్రమ అరెస్టులు చేయడం దారుణమని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబును బుధవారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి లాలపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ నగర గౌరవాధ్యక్షులు జి.సురేష్‌బాబు, సివిల్ సప్లయిస్ యూనియన్ జిల్లా నాయకులు కోట్ల మరియదాసులు గురువారం స్టేషన్‌కు వెళ్ళి అంజిబాబును పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ సంస్థలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు అగ్రిమెంట్ పూర్తై 8 నెలలు పూర్తయినప్పటికి యాజమాన్యం కానీ ప్రభుత్వం కానీ కూలీ పెంపుదల విషయంలో ఎటువంటి చర్య చేపట్టకపోవడంపై ప్రభుత్వ మొండి వైఖరిని వ్యతిరేకిస్తూ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని పోలీసులతో అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.

సమర్థ అభ్యర్థిని ఎన్నుకోండి

భయపడొద్దు.. ఒత్తిడికి లోనుకావద్దు

ఎంపీలకు మార్గరెట్ ఆల్వా పిలుపు

న్యూఢిల్లీ: సమర్థ అభ్యర్థిని ఎన్నుకోండి.. భయం లేకుండా ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా ఓటు వేయండి అని ప్రతిపక్షాల ఉమ్మడి ఉపరాష్ట్రపతి అభ్యర్థి మార్గరెట్ ఆల్వా గురువారం ఎంపీలకు సూచించారు. ఈ మేరకు ఆమె వీడియో సందేశమిచ్చారు. తనకు 50ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, నిష్పాక్షికంగా పనిచేస్తానని, దేశానికి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తానని, ఈ పదవికి తాను సమర్థురాలినని నమ్ముతున్నానని ఆమె వీడియో ద్వారా ఎంపీలనుద్దేశించి అన్నారు. ఈనెల 6న జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతి ఎంపీ తనకే ఓటు వేయాలని ఆల్వా కోరారు. అందరి మద్దతులో ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే ఆ పదవికి నిబద్ధురాలై ఉంటానని, ప్రధాన అంశాల్లో ఏకాభిప్రాయంతో ముందుకు వెళతానని, అందరితో కలిసి పని చేస్తానని, పార్లమెంటు ప్రతిష్ఠ పునరుద్ధరణకు కృషిచేస్తానని హామీనిచ్చారు. పార్టీలకు అతీతంగా తనకు ఓటు వేయాలని ఆల్వా కోరారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి కావడమే విశేషం-గౌరవమని అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో సభ్యురాలిగా 50ఏళ్ల అనుభవం ఉందని, కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా పనిచేశానని చెప్పారు. 'ఉపరాష్ట్రపతి ఎన్నికలు మిగతా ఎన్నికల వంటిది కాదు. పార్లమెంటు నిర్వహణపై రిఫరాండంగా దీనిని పరిగణించాలి. నేడు పార్లమెంటు ప్రతిష్టంభను ఎదుర్కొంటోంది. సభ్యుల మధ్య మాటల్లేవు. ఫలితంగా ప్రజలకు పార్లమెంటుపై గౌరవం తగ్గుతుంది' అని అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక భిన్నమైంది కాబట్టే ఇందుకు విప్ ఉండరాదని, రహస్య బ్యాలెట్ ఉండాలని రాజ్యాంగ రూపకర్తలు నిర్దేశించారని తెలిపారు. అత్యంత సమర్థ అభ్యర్థిని ఎలాంటి భయం-జంకు లేకుండా ఎన్నుకునే అవకాశం పార్లమెంటు సభ్యులకు ఉంటుందని నొక్కిచెప్పారు. ఆ అర్హత తనకు ఉందని నమ్ముతున్నందునే అందరి ఓట్లను కోరుతున్నానని ఆల్వా వెల్లడించారు. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎంపీలంతా పాల్గొనవచ్చు. ఎన్నికల రోజునే ఫలితాలూ వెలువడతాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.